

ఇందిరా గాంధీకి నివాళులు

దేశపు తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేతలు


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ – బుధవారం– 20– నవంబర్ – 2024 సంపుటి : 8 సంచిక : 331 పేజీలు : 8 వెల : రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA





నాలుగు బ్యాంకుల వాటా విక్రయం!




# కేసీఆర్.. కాస్కో

## అసెంబ్లీకి రా.. చూస్కుందాం

- నిన్ను ఫామ్ హౌజ్‌కే పరిమితం చేస్త
- నీ ఎత్తుగడలకు తగ్గ మందు నా దగ్గర ఉంది
- బీఆర్ఎస్‌ను బొందవెడ్త..
- కేటీ రామారావు కాదు ఆయన పేరు డ్రామారావు
- కిషన్ రెడ్డీ నీకు తెలంగాణలో ఉండే అర్హత లేదు.. గుజరాత్‌కు పోయి గులాంగిరీ చేస్కో.. గాడిదలు కాస్కో
- కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- ప్రగతికి అడ్డుపడే వారిని జైల్లోకి తోస్త
- బీఆర్ఎస్, బీజేపీలపై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హనుమకొండ,నవంబర్ 19 (మనం న్యూస్):** హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. వరంగల్‌ను అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను వృద్ధిలోకి తీసుకొచ్చినట్లేనని ఆయన అన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా మంత్రి, ఇన్చార్జ్ మంత్రి పట్టుబట్టి అభివృద్ధి పనులను సాధించుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటై ప్రజా పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా హనుమకొండలోని ఆరట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో సీఎం పాల్గొన్నారు. గత ప్రభుత్వం చేయలేని పనులు తాము చేస్తుంటే కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని ..మిగతా 2లో




### అందుకే.. భావోద్వేగ విమర్శలు

వరంగల్ ప్రజా పాలన విజయోత్సవాల్లో సీఎం బీఆర్ఎస్, బీజేపీలను తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడిన ఆయన ఈ పార్టీల విషయానికొచ్చేసరికి భావోద్వేగానికి గురైనట్టు కన్పించారు. తీవ్ర పదజాలంతో వారిపై విరుచుకుపడ్డారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారనీ.. దానిలో భాగంగానే కేటీఆర్ ఇటీవల ఢిల్లీలో పర్యటించారని వారంటున్నారు. అమృత్ పథకంలో రేవంత్ బావమరిదిని టార్గెట్ చేస్తూ.. ఈ వ్యవహారంపై ఎంక్వయిరీని కోరుతూ ఇటీవల ఢిల్లీలో కేటీఆర్ కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను ...మిగతా 2లో

## ఇందిరమ్మపై విమర్శలు చేస్తే సహించం

### కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే దిగుబడి పెరిగింది

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, నవంబర్ 19(మనంన్యూస్):** ఇందిరా గాంధీ పై నెగెటివ్ గా సినిమాలు తీసే వారికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. ప్రపంచ స్థాయిలో భారత్ నిలబడడంలో ఇంధిరా గాంధీ పాత్ర కీలకం అన్నారు. దేశ సమగ్రత కోసం ఇందిరా గాంధీ ప్రాణాలు విడిచారన్నారు. హనుమకొండలో ప్రజా పాలన విజయోత్సవ సభలో మీాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీలో ఉచిత రవాణా కోసం నెలకు 400 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ రుణాలు ఇవ్వబోతున్నామన్నారు. దేశ సమగ్రతపై అవగాహన లేని వారు, గతం గురించి తెలియని వారు ఇందిరా ...మిగతా 2లో

## వరంగల్‌ను హైదరాబాద్‌లా తీర్చిదిద్దుతాం

పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2





### అధికారులు తప్పు చేసినా చర్యలు తీసుకుంటాం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**సంగారెడ్డి, నవంబర్ 19, మనం న్యూస్:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. వెంకరమణ కాలనీ, శంభునికుంట, అమీన్‌పూర్ పెద్ద చెరువు, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మరావు నగర్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ రంగనాథ్.. స్థానికులతో మాట్లాడారు. అక్కడ భూములు ఆక్రమించి వేసిన లేఅవుట్లు, ఇతర సమస్యలపై పలువురు స్థానికుల రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. ''అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందాయి. ...మిగతా 2లో

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ రద్దు

- జీవో 16ను కొట్టేసిన హైకోర్టు
- 5,544 మంది ఉద్యోగాలు ప్రశ్నార్థకం

**హైదరాబాద్, నవంబర్ 19, మనం న్యూస్:** తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది. సెక్షన్ 10ఏ ప్రకారం తీసుకొచ్చిన జీవో 16ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో



లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. విచారణ చేపట్టిన హైకోర్టు జీవోను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 కాంట్రాక్టు ...మిగతా 2లో

## అక్రమ అరెస్టులు ఆపండి

### లగచర్ల నిందితులతో హుస్సేన్ నాయక్ 'ములాఖత్'

భూసేకరణను వ్యతిరేకించినందుకే మాపై కక్షసాధిస్తున్నార్నన బాధితులు

పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీలను ఆదేశించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

**హైదరాబాద్,నవంబర్ 19,మనం న్యూస్:** ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని లగచర్ల బాధితులు ఆరోపిస్తున్నారని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని కేంద్ర కారాగారంలో ఉన్న లగచర్ల నిందితులతో ఆయన సోమవారం సాయంత్రం ములాఖత్ అయ్యారు. అంతకుముందు వికారాబాద్ జిల్లా రోటిబండ తండా, లగచర్ల గ్రామాల్లో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ పీకే రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి అశోక్‌కుమార్లతో కలిసి పర్యటించారు. జైలు బయట హుస్సేన్నాయక్ విలేకరులతో మాట్లాడారు. అధికారులపై దాడికి పాల్పడినవారంతా జైలు బయటే ఉన్నారని ఆరోపించారు. రాజకీయ కుట్రతోనే రైతులను జైలుకు పంపారన్నారు. ఘటనపై వారం పది రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సీఎస్, డీజీపీలను ఆదేశించినట్లు తెలిపారు. లగచర్ల ఘటనకు 15 రోజుల ముందు కాంగ్రెస్ కార్యకర్త శేఖర్ గిరిజనులను దూషించారని, భూములు లాక్కుంటామంటూ కొట్టారని ఆరోపించారు. లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో అరెస్టులను ఆపాలన్నారు. అధికారులపై బాధితులు దాడి చేయడం సరైంది కాదని, పోలీసుల రక్షణ లేకుండా గ్రామసభకు కలెక్టర్ రావడం ...మిగతా 2లో

## 'కాగ్'గా తెలుగు వ్యక్తి

### 15వ అధిపతిగా నియామకం

**ఢిల్లీ:** భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గా కొండ్రు సంజయ్ మూర్తి నియమితులయ్యారు. రాష్ట్రపతి ఆయన్ను నియమించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి కుమారుడే సంజయ్ మూర్తి. 1964 డిసెంబరు 24న జన్మించారు. మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ చదివారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్ ప్రదేశ్ కేడర్ కు ఎంపికై, ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో పని చేస్తున్నారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం అమలులో క్రియాశీల ...మిగతా 2లో

## నిజనిర్ధారణను అడ్డుకోవడమంటేనే తప్పు చేసినట్టు

- మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి
- ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కేటీఆర్ డిమాండ్



**హైదరాబాద్, నవంబర్ 19,మనం న్యూస్:** వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో జిల్లా కలెక్టర్‌పై దాడి ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయిలో వాడి వేడిగా జరుగుతున్నాయి. దీంతో లగచర్లలో ఏం జరిగిందంటూ అసలు వాస్తవాలు తెలుసుకునే పనిలో ప్రతిపక్ష పార్టీలు నిమగ్నమైనాయి. అందుకోసం ఆయా పార్టీల నేతలు..ఆ గ్రామంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్నారు. అయితే వారిని లగచర్ల గ్రామ పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. అందులోభాగంగా భారీగా పోలీసులను మోహరించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా మంగళవారం స్పందించారు. ఆ క్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆయన పలు ప్రశ్నలు సంధించారు. లగచర్లలో అర్థరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదు.. పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా? అని ప్రశ్నించారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది? వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ప్రయత్నిస్తోందన్నారు.

## మోదీ మణిపూర్‌కు ఎందుకు రావడం లేదు

- సీఎం రాజీనామా చేయాలి ఇరోమ్ షర్మిల
- రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలన్న మల్లికార్జున ఖర్గే

2





### ప్రజలు దగా పడ్డారు

- విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు
- తిరోగమనంలో తెలంగాణ..
- ఇప్పటికైనా కళ్లు తెరవండి..
- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు

**హైదరాబాద్,నవంబర్ 19, మనం న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు జరపాల్సింది విజయోత్సవాలు కాదు.. అపజయోత్సవాలు జరపాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శలు చేశారు. అన్ని వర్గాలను సక్సెస్‌ఫుల్‌గా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ...మిగతా 2లో

## గాజాలో దయనీయ పరిస్థితులు

- ట్రక్కుల్లోని ఆహార పదార్థాలు లూటీ!

**గాజా:** ఇజ్రాయెల్ దాడులతో గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంక్షుభిత ప్రాంత ప్రజలకు అందిస్తున్న మానవతా సాయానికి తీవ్ర ఆటంకం కలిగింది. ఆహార సామగ్రిని తరలిస్తున్న ట్రక్కులను కొందరు లూటీ చేశారు. ...మిగతా 2లో

## పెరుగుతున్న గజ.. గజ..

- 12 డిగ్రీలకు రాత్రి ఉష్ణోగ్రత
- సిర్పూర్ లో 10.5 డిగ్రీల నమోదు

**హైదరాబాద్, నవంబర్ 19(మనంన్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతుంది. జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు ...మిగతా 2లో

## పోలీసులకు లొంగిపోయిన లగచర్ల ప్రధాన నిందితుడు

**కొడంగల్,నవంబర్ 19, మనం న్యూస్:** వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి కేసులో కీలక నిందితుడు బోగమోని సురేశ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో సురేశ్‌ను కొడంగల్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. కలెక్టర్‌పై దాడి కేసులో సురేశను ఏ2గా పోలీసులు ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు. ఘటన జరిగిన నాటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు మంగళవారం ఉదయం పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు.కలెక్టర్ బృందాన్ని ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద నుంచి ఊరిలోకి తీసుకెళ్లడంలో సురేశ్ కీలకంగా వ్యవహరించాడు. అక్కడికి వెళ్లిన వెంటనే ఆందోళనకారులు ...మిగతా 2లో

### పట్నంకు ప్రత్యేక బ్యారక్ ఇవ్వండి

- హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నవంబర్ 19, మనం న్యూస్:** చర్లపల్లి జైల్లో తనకు ప్రత్యేక బ్యారక్ ఇవ్వాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. తోటి ఖైదీలతో కాకుండా ఆయనకు ప్రత్యేక బ్యారక్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఇంటి భోజనం అనుమతించాలని కోర్టు పేర్కొంది. వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో నరేందర్రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
Central Bank of India

## నాలుగు బ్యాంకుల వాటా విక్రయం!

**న్యూఢిల్లీ :** నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మైనారిటీ వాటాలను విక్రయించాలనే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దేశీయ మార్కెట్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనలకు అనుగుణంగా ఈ వాటాల విక్రయం జరగనున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుల్లో వాటాను తగ్గించుకొనేందుకు కేంద్రం యోచిస్తోంది. దీనికోసం ఆర్థిక మంత్రిత్వశాఖ రానున్న నెలల్లో కేంద్ర కేబినెట్ నుంచి ఆమోదం పొందే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఓపెన్ మార్కెట్లో ఆఫర్ ఫర్ సేల్ రూపంలో వాటాను విక్రయించాలనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## గాజాలో దయనీయ పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 109 ట్రక్కుల్లో ఆహార పదార్థాలు తరలిస్తుండగా.. డ్రైవర్లపై తుపాకీ ఎక్కుపెట్టి 97 ట్రక్కుల్లోని సరకును కాజేశారని యూఎన్ఆర్ డబ్ల్యూఏ ఆరోపించింది. శనివారం జరిగిన ఈ దాడిలో సహాయ సిబ్బందికి గాయాలయ్యాయని, ట్రక్కులు దెబ్బతిన్నాయని వెల్లడించింది.''శాంతిభద్రతలు పూర్తిగా విచ్ఛిన్నమయ్యాయని మేం చాలాకాలంగా హెచ్చరిస్తున్నాం. కొద్దికాలంగా మా కాన్వాయ్లకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. ఇజ్రాయెల్ అధికారులు చట్టపరమైన బాధ్యతలను విస్మరిస్తున్నారు'' అంటూ తీవ్రంగా స్పందించింది. తక్షణ చర్యలు చేపట్టకపోతే.. గాజాలో తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుందని ఐరాస ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. గాజాలో పనిచేస్తోన్న యూఎన్ఆర్డబ్ల్యూఏ ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. ఒక సంచిపిండి కోసం ప్రజలు కొట్టుకునే పరిస్థితులు నెలకొని ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ''గాజా (ఎన్క్లేవ్)లో పరిస్థితి భయంకరంగా ఉంది. క్షామం ముప్పు పొంచి ఉంది. సుమారు 10 లక్షల మంది ఆకలితో మరణించే ప్రమాదం ఉంది'' అని ఇప్పటికే వరల్ ఫుడ్ ప్రోగ్రామ్ హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో సోమవారం 50 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక్క కుటుంబానికి చెందిన వారే 17 మంది ఉండటం గమనార్హం.

## అందుకే.. భావోద్వేగ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు.. లగచర్ల కేసులో కూడా బాధితులను ఢిల్లీకి తీసుకుపోయి 'హక్కుల కమిషన్ల'కు వినతులు ఇవ్వడం, రాష్ట్రపతిని కలువడానికి ప్రయత్నిస్తుండడం.. ఈ పరిణామాలకు కేంద్రంలోని బీజేపీ పెద్దలు సానుకూలంగా స్పందిస్తున్నారంటూ సమాచారం వెలువడుతుండడం ఈ రెండు పార్టీల కుట్ర పూర్తి వైఖరికి నిదర్శనమంటున్నారు. అంతే కాదు, మూసీ సుందరీకరణను వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ వైఖరికి సపోర్టు చేస్తున్నట్టుగా రాష్ట్ర బీజేపీ నేతల ప్రకటనలిస్తుండడం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల మూసీ ప్రాంతంలో రాత్రి బస కార్యక్రమాల్లో పాల్గొనడం ఈ అనుమానాలను బలపరుస్తున్నాయని పరిశీలక వర్గాలంటున్నాయి. పైగా తనను వ్యక్తిగతంగా 'బ్లేమ్' చేస్తున్నారని భావిస్తున్న కారణంగానే సీఎం రేవంత్ రెడ్డి వారిని టార్గెట్ చేస్తూ హన్మకొండ సభలో తీవ్ర విమర్శలు చేశారని, ఎమోషనల్గా మాట్లాడారని వారు చెబుతున్నారు.

## అక్రమ అరెస్టులు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

కూడా తప్పన్నారు. పోలీసులు రాత్రిపూట వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గిరిజనులు, లగచర్ల గ్రామస్థులు కమిషన్ సభ్యుల దృష్టికి తెచ్చారు. దీంతో రాత్రిపూట ఇళ్ల వద్దకు పోలీసులు రావద్దని ఎస్పీ నారాయణరెడ్డితో హుస్సేన్నాయక్ అన్నారు. వేరే మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తన భర్త రాఘవేందర్ను పోలీసులు రిమాండుకు పంపడంతో అధికారులు సస్పెండ్ చేశారని ఆయన భార్య వాపోయారు. గ్రామాల్లో కమిషన్ పర్యటన సందర్భంగా మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పటిష్ఠ భద్రతాచర్యలు చేపట్టారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన భూసేకరణను వ్యతిరేకించినందుకు.. తమపై అధికార వ్యవస్థ కక్షసాధింపు చర్యలకు దిగిందని వికారాబాద్ జిల్లా లగచర్లకు చెందిన గిరిజన మహిళలు ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిశోర్ మక్వానా, ఎస్టీ కమిషన్ సభ్యుడు నిరుపమ్ చక్మా, మహిళా కమిషన్ మెంబర్ సెక్రటరీ మీనాక్షి నేగి, మానవ హక్కుల కమిషన్ ప్రజెంటింగ్ ఆఫీసర్ యాస్మిన్ అహ్మద్లను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. తమ భూములను అన్యాయంగా లాక్కుంటున్నారని పేర్కొన్నారు. అమాయకులైన మహిళలు, పిల్లలపై పోలీసులు జరిపిన దౌర్జన్యాలపై దర్యాప్తు జరిపించి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 140మందితో వెళ్తున్న విమానంలో సాంకేతిక లోపం.. కొచ్చికి దారి మళ్లింపు!



కొచ్చి: ఇండిగో విమానయాన సంస్థకు చెందిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. బెంగళూరు నుంచి మాలేకు వెళ్తుండగా సాంకేతిక సమస్య ఏర్పడటంతో అప్రమత్తమైన పైలట్ ఈ విమానాన్ని కేరళలోని కొచ్చికి మళ్లించి అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విమానంలో 140మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2.21గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు.ఈ అంశంపై ఇండిగో స్పందించింది. సమస్య తలెత్తిన విమానానికి అవసరమైన మరమ్మతులు చేసిన తర్వాత తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తామని తెలిపింది. ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేర్చేందుకు వీలుగా ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సాంకేతిక లోపంతో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఘటనపై విమానాశ్రయ అధికారులు స్పందించారు. మంగళవారం మధ్యాహ్నం 2.05 గంటల సమయంలో ఎమర్జెన్సీ ప్రకటించగా.. 2.21గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు తెలిపారు. ఈ విమానంలో ప్రయాణిస్తున్న వారిలో 136మంది ప్రయాణికులతో పాటు నలుగురు సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో 91మంది భారతీయ పౌరులు కాగా.. 49మంది విదేశీయులు ఉన్నారని వివరించారు.

## అధికారులు తప్పు చేసినా చర్యలు తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద చెరువు అలుగులు, తూములు మూసేయడంతో ఎఫ్టీఎల్ పెరిగిందని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేకమైన టెక్నికల్ బృందంతో సర్వే చేయిస్తాం. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వంతో చర్చించి మూడు నెలల్లో ఫలితాలతో మళ్లీ వస్తాం. పద్మావతి లేఅవుట్కు సంబంధించి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమణలకు పాల్పడ్డారని కొందరు మా దృష్టికి తీసుకొచ్చారు. పార్కులు, రోడ్లు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేసి నిజం అని తేలితే హైడ్రా చర్యలు తీసుకుంటుంది.

అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మరిన్ని ప్రాంతాల్లో ఇదే తరహాలో రోడ్లు, పార్కులు, చెరువులు కబ్జాకు గురైనట్లు అన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటన్నింటిపైనా పూర్తిస్థాయి విచారణ చేస్తాం. అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉండడంతో కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. చెరువుల పునరుద్ధరణ అనేది ప్రధాన అజెండాగా పెట్టుకున్నాం. ఆక్రమణకు గురైన రోడ్లను కూడా పునరుద్ధరిస్తాం. ఆక్రమించిన వారు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులు తప్పు చేసినట్లు విచారణలో తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు.

## పెరుగుతున్న గజ.. గజ..

(మొదటి పేజీ తరువాయి)

నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో చలి పెరుగుతుంది.కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కొమురం భీం జిల్లా సిర్పూర్ లో 10.5 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా పొచ్చెరలో 11.8 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నిర్మల్ జిల్లా కుంటాలలో 12.6 డిగ్రీలు కాగా ఇక మంచిర్యాల జిల్లా ర్యాలీలో 13.1 గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయింది. మిగతా జిల్లాల్లోనూ చలిగాలులు వీస్తున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు రోజులుగా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో చలి గాలుల తీవ్రత పెరిగింది. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంలో 12.2 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాబాద్లో 12.6 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో 13.8 డిగ్రీలు, కుత్బుల్లాపూర్, శామీర్పేట్లో 14.4 డిగ్రీలు, అత్యల్పంగా 12.2 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 12.2, వికార్బాద్లో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యల్పంగా నమోదైంది. ఇక రాజధాని నగరం హైదరాబాద్లోనూ చలి తీవ్రత పెరుగుతోంది. శివారు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## ఇందిరమ్మపై విమర్శలు చేస్తే సహించం

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతం గురించి తెలిసిన వారు ఇందిరా గాంధీకి చేతులు ఎత్తి నమస్కరిస్తారన్నారు. దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు ఇందిరా గాంధీపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా ఇందిరా గాంధీని నెగిటివ్ గా చూపిస్తున్నారని మండిపడ్డారు. దేశ చరిత్రపై అవగాహన లేని వాళ్ళు కావాలని సినిమాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని విభజించి లబ్ధి పొందాలని చూస్తున్నవాళ్లు ఇందిరా గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంతో పంట దిగుబడి పెరగలేదన్నారు.

## 'కాగ్'గా తెలుగు వ్యక్తి

(మొదటి పేజీ తరువాయి)

పాత్ర పోషించారు. ఐఏఎస్ అధికారిగా వచ్చేనెలలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా, సంజయ్ సేవలను గుర్తించిన కేంద్రం ఈ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ పదవి చేపట్టబోతున్న తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ రికార్డులకెక్కారు. ఈ స్థానంలో నియమితులైన వారు గరిష్ఠంగా ఆరేళ్లు కానీ, 65 ఏళ్ల వయసు వరకు కానీ కొనసాగడానికి వీలుంది. సంజయ్ మూర్తి తండ్రి కేఎస్ఆర్ మూర్తి 1996లో కాంగ్రెస్ తరపున అమలాపురం నుంచి లోక్ సభకు ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు ఆయన కూడా ఐఏఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో సేవలందించడం విశేషం.

## మోదీ మణిపూర్కు ఎందుకు రావడం లేదు



**న్యూఢిల్లీ, నవంబర్ 19:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్లో కొంతకాలంగా మళ్లీ హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, వాటిని పునరుద్ధరించేందుకు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. ఈ మేరకు ఆయన రెండు పేజీల లేఖ రాశారు. మణిపూర్లో మానవహక్కుల ఉల్లంఘున జరుగుతోందని ఫిర్యాదు చేశారు. ప్రజల జీవితాలకు రక్షణ కల్పించేందుకు వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మణిపూర్లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల కారణంగా ఇప్పటివరకు మహిళలు, చిన్నారులు సహా 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కేవలం రాష్ట్రపతి జోక్యం చేసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, మళ్లీ మణిపూర్ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించగలుగుతారని లేఖలో పేర్కొన్నారు.

### మణిపుర్ సీఎం రాజీనామా చేయాల్సిందే: ఇరోమ్ షర్మిల

రాష్ట్రంలో శాంతిభద్రతలు పునరుద్ధరించడంలో సీఎం బీరేన్ సింగ్ విఫలమయ్యారని పౌరహక్కుల నేత, మణిపుర్ ఉక్కు మహిళ ఇరోమ్ షర్మిల దుయ్యబట్టారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు బాధ్యత వహిస్తూ.. వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని, ఇక్కడ సమస్యల పరిష్కారం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు.

మరోవైపు కేంద్రం తీరును కూడా ఆమె తప్పుబట్టారు. మూడో సారి ఎన్నికైన తర్వాత ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటిస్తున్నారని, కానీ, మణిపుర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

## పోలీసులకు లొంగిపోయిన లగచర్ల ప్రధాన నిందితుడు

(మొదటి పేజీ తరువాయి)

నినాదాలు చేస్తూ ముందుకు దూసుకురావడంతో గందరగోళం నెలకొంది. ఆ సమయంలో సురేశ్ సైతం నినాదాలు చేసినట్లు వీడియోల్లో కనిపించడంతో ఆయనే పక్కా పథకంతో అధికారుల్ని అక్కడికి రప్పించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పటికే వారిని రెచ్చగొట్టి దాడికి సిద్ధం చేసి ఉంటాడని.. కలెక్టర్ వాహనం దిగిన క్షణాల వ్యవధిలోనే ఆందోళనకారులు ఆయనపైకి దూసుకురావడంతోపాటు మరో అధికారి వెంకట్రెడ్డిని వెంటాడి కొట్టేందుకు అదే కారణమై ఉంటుందని నమ్ముతున్నారు. సురేశ్ను పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించే అవకాశముంది. కొడంగల్ కోర్టు సురేశ్కు 14 రోజులు రిమాండ్ విధించింది.

## వరంగల్ను హైదరాబాద్లా తీర్చిదిద్దుతాం



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్కు ఏమాత్రం తగ్గకుండా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని వరంగల్ ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలి.. మార్పుచెందాల్సిన అవసరం ఉందని నమ్మిన మొదటి అడ్డా ఈ వరంగల్ గడ్డ అని అన్నారు. రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ చేసిన గడ్డ ఇది. మొదటి బడ్జెట్లోనే 72 వేల కోట్ల రూపాయలను వ్యవసాయానికి కేటాయించడమే కాకుండా...ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘతన ఈ ప్రభుత్వానిది. గత ప్రభుత్వం వరంగల్లో అనేక కార్యక్రమాలు చేపడుతామని చెప్పి వాటిని పూర్తి చేయకుండా మాటలకే పరిమితం చేసిందని విమర్శించారు.

2014లో కాళోజీ ఆడిటోరియాన్ని కేసీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ పూర్తి చేయలేదన్నారు. వాళ్లు బిల్డింగులు కట్టుకునేందుకే డబ్బులు పెట్టారు...కమీషన్లకోసం కాళేశ్వరంలాంటి ప్రాజెక్టులు కట్టింద్రు కానీ కళాక్షేత్రాన్ని మాత్రం పూర్తిచేయలేదన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరా గాంధి జయంతి రోజున ఇద్దరు మహిళా మంత్రులున్న వరంగల్లో మహిళా సదస్సు పెట్టడం సంతోషించదగిన విషయం అన్నారు.

# కేసీఆర్.. ఖాస్కో

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. సూర్య, చంద్రులు ఉన్నంత వరకూ ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలు, ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే తాను టీపీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్నిక అయ్యానని రేవంత్ అన్నారు. అందుకే ఆడబిడ్డల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మా ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపై ఉంది. 2014 నుంచి 2019 వరకూ బీఆర్ఎస్ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రిగా లేరని విమర్శలు గుపిచిన ఆయన తమ మంత్రివర్గంలో కొండా సురేఖ, సీతక్కకు మంత్రులుగా అవకాశం కల్పించామన్నారు. ఈ ఓరుగల్లు ఆడబిడ్డలకే మంత్రివర్గంలో ప్రముఖస్థానం ఇచ్చి నేటి సభ నిర్వహణ కార్యక్రమాన్ని సైతం వారి చేతుల్లోనే పెట్టామని రేవంత్ తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కడియం కావ్యను ఎంపీ చేశామని చెప్పారు. ఆమె తెలంగాణ సమస్యలపై పార్లమెంట్లో గళం విప్పుతోందని అన్నారు. పాలకుర్తిలో ఓ రాక్షసుడు రాజ్యమేలుతుంటే యశస్విని రెడ్డి అనే సోదరి ఆ రాక్షసుడిని ఓడించి పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేసిందని సీఎం కొనియాడారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ కూడా ఆడబిడ్డనే అని ఆయన తెలిపారు. అనేక మంది మహిళా అధికారులు పలు జిల్లాలకు కలెక్టర్లుగా ఉన్నారని వెల్లడించారు. వరంగల్ కార్పొరేషన్ మేయర్గా కూడా మహిళ ఉందని తెలిపారు. వారి రుణం ఇంకా తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### ఫామ్ హౌజ్కే పరిమితం చేస్తానంటూ కేసీఆర్కు హెచ్చరిక

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేలా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తే జైల్లో పెడతాం. తెలంగాణలో కేసీఆర్ తాగుబోతుల సంఘాన్ని తయారు చేశారు. ఫుల్, హాఫ్కు కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్, ప్రజలను మత్తుకు బానిసలుగా చేసి అధికారం చెలాయించారు. బీఆర్ఎస్ అధికారం పోతే కేసీఆర్, కుటుంబ సభ్యుల ఉద్యోగాల ఊడాయి తప్ప.. రాష్ట్రానికి ఏం కాలేదు. కేసీఆర్.. హాయిగా ఫామ్ హౌస్లో పడుకో... అవసరమైతే అక్కడే వైన్ షాప్ ఏర్పాటు చేయిస్తా. నిన్ను అక్కడికే పరిమితం చేస్తా అని సీఎం అన్నారు. మీ ఉద్యోగాలు పోయాయి కాబట్టి రైతులకు రుణమాఫీ జరుగుతోంది. ఇంకా కొంతమందికి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగలేదు. కచ్చితంగా చేసి తీరుతాం. అభివృద్ధిపై చర్చకు బిర్లా-రంగాలు సిద్ధమా? అని కేటీఆర్, హరీశ్ రావునుద్దేశించి ముఖ్యమంత్రి సెటైర్లు వేశారు. ఆయన పేరు కేటీ రామారావు కాదు, ఆయన పేరు డ్రామారావు అని ఛలోక్తి విసిరారు. రైతు రుణమాఫీ చేస్తే అభినందించాల్సిందిపోయి శవిమర్శిస్తున్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అనలేదా?. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో అసెంబ్లీకి వచ్చి చెప్పాలి. నువ్వు ఎప్పుడంటే అప్పుడు అసెంబ్లీ పెట్టిస్తా. కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి మాట్లాడాలి. ఆయన రాకుండా ఇద్దరు చిల్లరగాళ్లను పంపుతున్నారు. ఆఖరి రక్తపు బొట్టు వరకూ ప్రజల కోసం పనిచేస్తా. తెలంగాణలో బీఆర్ఎస్ను బొందవెడ్త.. ఆ మొక్కను మళ్లీ మొలవనివ్వనని చెప్పారు. నీ ఎత్తులకు తగ్గ మందు నా దగ్గర ఉంది. దమ్ముంటే అసెంబ్లీకి రా.. చర్చిద్దాం అని కేసీఆర్కు సవాల్ విసిరారు. కేసీఆర్ మాట ఇచ్చి.. పదేళ్లలో రుణమాఫీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆరు నెలల్లోనే రుణమాఫీకి రూ.18వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఒక్కసారి ఓడిస్తే.. మళ్లీ ప్రజల మొహం చూడరా? అధికారం ఇస్తే దోచుకోవడం.. ఓడిస్తే ఫామ్ హౌజ్లో కూర్చోవడమేనా మీ పని అని ప్రశ్నించారు. ప్రజల మీద ప్రేమ ఉంటే ఎందుకు ప్రజల మధ్యకు రావడం లేదని నిలదీశారు. రాహుల్ గాంధీని చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. మూడుసార్లు అధికారం దక్కకపోయినా.. రాహుల్ గాంధీ ప్రజల మధ్యే ఉన్నారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యతను ఎందుకు నిర్వర్తించడం లేదని నిలదీశారు.

### కిషన్ రెడ్డి గులాంగిరీ..

తెలంగాణ ద్రోహి ప్రధాన మంత్రి మోదీ. అలాంటి మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గులాంగిరీ చేస్తారంట. ఆయనకు తెలంగాణలో ఉండే అర్హత లేదంటూ విమర్శించారు. గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలను కిషన్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్లో సబర్మతి సుందరీకరణను సమర్థిస్తూ మూసీ సుందరీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు.

సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అందుకే ఆమె కాళ్లు కడిగి నెత్తిన పోసుకున్నా తప్పులేదన్నారు. కాళోజీ కళాక్షేత్రం పదేళ్లైనా మీరెందుకు పూర్తిచేయలేదంటూ కేసీఆర్ను ప్రశ్నించారు. తెలంగాణ భావాన్ని విశ్వవ్యాప్తం చేసిన వ్యక్తి కాళోజీ నారాయణరావు. అందుకే కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు. మీరు అభివృద్ధి చేసేవాళ్ల కాళ్లలో కట్టె పెట్టొద్దు. అలా చేస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావంటూ ముఖ్యమంత్రి హెచ్చరించారు. దుర్బుద్ధితో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లపాటు మనసొప్పలేదని, ఎంతో పట్టుదలతో కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు. ''వరంగల్ గడ్డ నుంచి రైతులందరికీ మరోసారి మాట ఇస్తున్నా. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రూ.2 లక్షలలోపు రుణమాఫీ వర్తించలేదు. ఇచ్చిన మాట ప్రకారం రుణాలన్నీ మాఫీ చేస్తాం'' అని సీఎం ప్రకటించారు. వరంగల్లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. డిజిటల్ విధానంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కాళోజీ జీవిత విశేషాలను తెలిపేలా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ప్రదర్శనను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. కళాక్షేత్రం ముందు ఏర్పాటు చేసిన కాళోజీ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.

## ప్రజలు దగా పడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ వేదికగా అన్ని వర్గాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్, మహిళలకు ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. పది నెలల్లో రాష్ట్రాన్ని పదేళ్ల వెనక్కి తీసుకువెళ్లారని ఆరోపించారు. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్రెడ్డి పై మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.


''ఎవరనుకున్నారు ఇట్లవున్నానని.. ఎవరనుకున్నారు ఇట్లవున్నానని' ప్రజాకవి కాళోజీ నినదించినట్లు కాంగ్రెస్ చేతిలో ప్రజలు దగా పడ్డారు. రైతులు దారుణంగా మోసపోయారు. ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు, అపజయాలను కప్పిపుచ్చుకునేందుకు వరంగల్ వేదికగా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. ఏం సాధించారని సంబురాలు జరుపుకుంటున్నారు రేవంత్ రెడ్డి. ఇదే వరంగల్ వేదికగా ఇచ్చిన రైతు డిక్లరేషన్కు ఏడాది అయినా అతీగతీ లేదు. డిక్లరేషన్లో చెప్పిన మొట్ట మొదటి హామీ రూ. 2లక్షల రుణమాఫీ ఇంకా పూర్తి చేయలేదు. రైతులు, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.15వేల భరోసా దిక్కులేదు. ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి ఇస్తాన్న రూ.12వేలు ఇవ్వనేలేదు. పది రకాల పంటలకు ఇస్తామన్న బోనస్ బోగస్ చేశారు. ఆనాడు మీరు ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదు. ఇందుకేనా మీ వరంగల్ విజయోత్సవ సభ రేవంత్ రెడ్డి. మీ పది నెలల పాలనలో రాష్ట్రాభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిందని అని హరీశ్రావు ఆవేదన వ్యక్తం చేశారు.'కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ, నేడు తిరోగమనం బాట పట్టింది. అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేసే దుస్థితి. వద్దురో నాయనా కాంగ్రెస్ పాలన అంటూ పాటలు పాడుకుంటున్న పరిస్థితి. పురుగుల్లేని భోజనం కోసం గురుకుల పిల్లలు, స్కాలర్ షిప్పుల కోసం విద్యార్థులు, ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, రుణమాఫీ, రైతు బంధు కోసం రైతన్నలు, జీతాల కోసం ఆశాలు, అంగన్ వాడీలు, డీఏ, పీఆర్సీ కోసం ప్రభుత్వ ఉద్యోగులు నిధులు విడుదల చేయాలంటూ గ్రామ పంచాయతీ సిబ్బంది, ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తూ పల్లె ప్రజలు, ఇళ్లు కూలగొట్టొద్దని హైడ్రా బాధితులు, సమస్యలు పరిష్కరించాలంటూ పోలీసులు , పింఛన్లు పెంచాలంటూ వృద్ధులు, బడిలో చదువుకునే పిల్లల నుంచి పింఛన్లు అందుకునే అవ్వాతాతల వరకు అందర్నీ రోడ్ల మీదకు తెచ్చారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటే, పది నెలల పాలనలో నువ్వు అందరి కడుపు కొట్టావు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచావు'' అని విమర్శించారు.

''మీరు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు రేవంత్ రెడ్డి, ప్రజల్ని మోసం చేసినందుకు అపజయోత్సవాలు జరుపుకోవాలి. ఏడాది కావొస్తుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. అద్భుతాలు చేశామనే భ్రమ నుంచి బయటపడి ఇచ్చిన హామీలు అమలు చేయండి. గోబెల్స్ ప్రచారాలు పక్కన బెట్టి పరిపాలన మీద దృష్టి సారించండి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయండి. మీ వైఫల్యాలను గుర్తించి మోసం చేసినందుకు వరంగల్ వేదికగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు(ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్యశాఖలోని 837 మంది వైద్య సహాయకులు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులు ఉన్నారు.



సబ్ స్టేషన్ల నిర్మాణం కొరకు మయూరి నగర్ లో ఒక ఎకరం, నల్లగండ్ల హుడా కాలనీ లో ఒక ఎకరం చొప్పున స్థలం తోపాటు సబ్ స్టేషన్ల నిర్మాణము కొరకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అమీర్ పేట్ లోని ఎచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వినతిపత్రం అందచేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి,మనం న్యూస్

# డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**చేవెళ్ల, నవంబర్ 19(మనం న్యూస్) :** మండల పరిధిలోని అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల సమావేశం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తరపున ప్రమాద బీమా 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని పాఠశాల లో కార్మిక చట్టాలకు విరుద్ధంగా డ్రైవర్లకు వేతనాలు చెల్లిస్తున్నారని కనీస వేతనాలు అమలు చేయాలని సూచించారు. అనంతరం నూతన చేవెళ్ల మండల బస్సు డ్రైవర్స్ యూనియన్ ఎన్నుకోవడం జరిగింది. మండల స్కూల్ బస్సు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులుగా కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి అజీమ్ కోశాధికారి శ్రీశైలం,ఉపాధ్యక్షులు సురేష్, వెంకటయ్య,కుమార్ సహాయ కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, బాలస్వామి,ఆశప్ప, సలహాదారులు ఆసిఫ్ ను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో చేవెళ్ల మండల డ్రైవర్ యూనియన్ నాయకులు శివ, శ్రీశైలం,రంజిత్ కుమార్,రామచంద్రయ్య,దశావత్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.




# సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



**చేవెళ్ల,నవంబర్ 19 (మనం న్యూస్) :** సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు.చేవెళ్ల మండలం కేంద్రం బస్టాండ్ నుండి గ్రామం వరకు జరుగుతున్న సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిసి రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరిత గతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు ఆయన సూచించారు.పనులను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి,దామర్ గిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా,చేవెళ్ల మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# కల్లు తయారీలో మత్తు పదార్థాలను వాడితే చర్యలు తప్పవు

**చేవెళ్ల, నవంబర్ 19( మనం న్యూస్) :** కల్లు తయారీలో నిషేధిత మత్తు పదార్థాలను కలిపితే వాడిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీలత అన్నారు. మంగళవారం శంషాబాద్ ఎక్సైజ్ శాఖ డిపిఓ ఆదేశాల మేరకు చేవెళ్ల మండలం ఎక్సైజ్ శాఖ పరిధిలో గల ఖానాపూర్,దామరగిద్ద ,అంతారం, గొల్లపల్లి,కౌకుంట్ల గ్రామాల్లో కల్లు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్లు శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్లు తయారీలో మత్తు పదార్థాల వాడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల తయారైన కల్లుకు ప్రజలు బానిసై ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆమె వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఖాజా మొయినుద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవ చిరస్మరణీయం



**చేవెళ్ల,నవంబర్ 19 (మనం న్యూస్) :** భారతదేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీర వనిత మాజీ ప్రధానమంత్రి ఇంద్రగాంధీ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కొనియాడారు. మంగళవారం ఇందిరా గాంధీ 107వ జయంతిని పురస్కరించుకొని షాబాద్ చౌరస్తాలో గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అన్నారు. ఆమె దేశం కోసం ప్రజల సౌకర్యార్థం 1969 లో బ్యాంకులను జాతీయకరణ చేసి జాతికి అంకితం చేశారన్నారు. అదేవిధంగా జాతీయ ఆహార భద్రత ను తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు.గరీబ్ హఠావో అను నినాదంతో ముందుకు వెళ్లారన్నారు.దేశ రక్షణ కోసం అణు భద్రతను తీసుకువచ్చిన ఆమె ధీర వనిత అన్నారు. దేశం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమైనవి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి,పీ ఏ సీ ఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు శైలజ ఆగిరెడ్డి. మధు సుదన్ గుప్తా,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, డైరెక్టర్ నరేందర్, సత్య నారాయణ, మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య,పీసీ సీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్,మల్కాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,నాయకులు,తదితరులు ఉన్నారు.

## గవర్నర్‌ను కలిసిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ



రంగారెడ్డి,నవంబర్ 19 (మనం న్యూస్) : వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రభుత్వ అధికారులపై రైతుల మాటున దాడి చేసిన దోషులు, దాడికి ప్రేరేపించిన కుట్రదారులపై కఠిన చర్యలకు ఆదేశించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు కోరారు. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో మంగళవారం జేఏసీ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు.లగచర్ల ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను గవర్నర్‌కు వివరించారు. రైతుల మాటున కొందరు దుండగులు అధికారులపై దాడికి పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించే ప్రమాదం ఉందనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రైతుల మాటున అధికారులపై దాడికి పాల్పడ్డ దుండగులపై, దాడికి ప్రేరేపించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల భద్రత కోసం, వారు సురక్షిత వాతావరణంలో స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితులు కల్పించేలా సంబంధిత అధికారవర్గాలకు ఆదేశాలు ఇవ్వాలని వినవించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డా. నిర్మల, జీఎస్ కుమారస్వామి, కె. రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, మేడి రమేష్, దర్శన్ గౌడ్, ఫూల్ సింగ్ చౌహాన్, మహిపాల్ రెడ్డి, అంజయ్య, రాబర్ట్ బ్రూస్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన అశ్వత్థ లక్ష్మీ నారాయణ కళ్యాణం

రంగారెడ్డి,నవంబర్ 19 (మనం న్యూస్) : ఆర్కే పురం ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్, సరూర్ నగర్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణపురం పార్కులో కార్తీక మాసం సందర్భంగా శ్రీ అశ్వత్థ లక్ష్మీ నారాయణ కల్యాణ మహోత్సవము వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు హాజరై పూజలు నిర్వహించారు.మధుర ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్కే పురం లో సనాతన ధర్మ కార్యక్రమాలను నిర్వహించడం చాలా ఆనందంగా వుందని తెలిపారు.బ్రహ్మశ్రీ శ్రీనివాస గురుమూర్తి ఆధ్వర్యంలో గోపూజ, ఉసిరి చెట్టు పూజ, రావి - వేప చెట్లను సాక్షాత్ విష్ణుమూర్తి, లక్ష్మి అమ్మవారి స్వరూపంగా భావిస్తూ కళ్యాణం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రామారావు,రమేష్ బాబు,ఉదయభాను,మునిపల్లె శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, శ్రవణ్, నీలిమ,రాధ , అన్నపూర్ణ, స్వప్న,అర్చన,రాణి, పుష్ప, విజయ లక్ష్మి పాల్గొన్నారు.



## విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి

**రంగారెడ్డి,నవంబర్ 19 (మనం న్యూస్) :** విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలిజ్ఞానానికి మరో నిదర్శనం పుస్తకం అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ బాలల దినోత్సవం పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ వాసు ఆధ్వర్యంలో పిల్లల పుస్తక ప్రదర్శనను చైర్మన్ రియాజ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం ఒక దేవాలయం వంటిదని ప్రతి ఒక్క పుస్తకం అపారమైన జ్ఞానానికి నిదర్శనం గా ఉంటుందన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని పుస్తకం మంచి స్నేహితుని వలె అండగా ఉంటుందన్నారు. నేటి ఆధునిక సమాజంలో చిన్నారులు విపరీతంగా సెల్ ఫోన్ వాడకానికి అలవాటు పడి చెడు సావాసాల బారిన పడుతున్నారన్నారు. కనీసం పుస్తకం దాని విలువలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరు తమ పిల్లలకు పుస్తక పఠనంపై మక్కువను పెంచే విధంగా చేయాలన్నారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చూస్తామని తెలిపారు.




## 83,64,331 నివాసాలలో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి

హైదరాబాద్, నవంబర్ 20(మనంన్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల గణన లో నేటివరకు 83 , 64 ,331 నివాసాలలో సర్వే పూర్తి అయింది. దేశానికే ఆదర్శవంతంగా అయ్యేవిధంగా నిర్వహింస్తున్న ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1 , 16 , 14 , 349 నివాసాలలో నేటివరకు 83 .64 లక్షలలో 72 శాతం సర్వే పూర్తయింది. నవంబర్ 6 వతేదీన ప్రారంభమైన ఈ సర్వే ను జాప్యంలేకుండా సకాలంలో పూర్తి చేయడానికి కృషిచేయాలనిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. మొదటి దశలో నిర్వహించిన నివాసాల లిస్టింగ్ లో మొత్తం 1,16,14,349 ఇళ్లకు మార్కింగ్ చేయడమైనదని, ఈ ఇళ్లల్లో ఏ ఒక్క ఇల్లును కూడావదలకుండా ప్రతీ ఇంటిలో సమగ్రంగా సర్వే ను నిర్వహించాలని స్పష్టం చేశారు. నేటి వరకు రాష్ట్రంలో 98 .9 శాతం పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలవగా, 95 .శాతం పూర్తితో నల్గొండజిల్లా ద్వితీయ స్థానంలో, 93 .3 శాతం తో జనగాం జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. 50 .3 శాతం సర్వేపూర్తితో జీహెచ్ ఎంసీ చివరి స్థానంలో ఉంది. 61 .3 శాతం తో చివరి నుండి ద్వితీయ స్థానాల్లో మేడ్చల్ మల్కాజిగిరి, 63 శాతంతో హన్మకొండ, 67 .4 శాతంతో వికారాబాద్ జలాలు తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఈ సర్వేలో 87 ,807 మంది సిబ్బంది, 8788 పర్యవేక్షక అధికారులుపాల్గొంటున్నారు. కాగా, ఈ సర్వే కు ప్రజల నుండి స్పందన బాగా ఉందని అధికారులు వివరించారు. 52, 493 గ్రామీణ, 40 ,901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92 ,901 బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతోంది..ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షించాడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాలకు నియమించారు. క్షేత్ర స్థాయిలో ఈ సీనియర్ అధికారులు కూడా పర్యటిస్తూ సర్వే తీరును సమీక్షిస్తున్నారు.


## అర్హత సాధించిన విద్యార్థులను అభినందించిన మధు యాష్కీ

**రంగారెడ్డి,నవంబర్ 19 (మనం న్యూస్) :**పట్టుదలతో ప్రయత్నించి ప్రో కబడ్డీ లో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందం కలిగించే విషయమని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. నాగోల్ప్రభుత్వ పాఠశాలలోచదువుతు న్న ఈ పిల్లలు వారిని సుశిక్షితులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు , పీఈటీ ల కృషి అభినందించదగినది. . సామాన్య కూలీ పని చేసుకునే కుటుంబాలకు చెందిన పిల్లలు క్రీడల్లో ఇంత అద్భుతంగా రాణించడం అభినందనీయం. తెలంగాణ ప్రభుత్వం కూడా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. కావాల్సిన ద్భుతప్రతిభ కనబరుచుతున్న నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున అన్ని విధాలుగా సహాయం అందే విధంగా చూస్తాను. వారు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను.



# లవర్స్‌కు అడ్డగా బేకరీలు, రెస్టారెంట్లు....

●పరదాల మాటున ప్రేమ కలాపాలు ●గంటకో చొప్పున రేటు ●జంటల బలహీనతను కాసులుగా మార్చుకుంటున్న వైనం



**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 20(మనంన్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలు బేకరీలు, రెస్టారెంట్లు వికృత చేష్టలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రేమ జంటల రహస్య కలయికల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోన్న వేదికలుగా పలు రెస్టారెంట్లు, బేకరీలు కొత్త పోకడలకు తెరలేపుతున్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండా జంటలు ఏకాంతంగా గడిపేలా సౌకర్యాలు కల్పిస్తూ ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. పర్యవసానంగా ఫ్యామిలీ సెక్షన్ల పేరిట ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్యాబిన్లు ప్రేమికులకు ఆవాసాలుగా మారుతున్నాయి. పలువురు హోటళ్ల నిర్వాహకులు ఇలాంటి ప్రేమికుల వద్ద నుంచి గంటకో రేటు చొప్పున బిల్లులు వేస్తూ వారి జేబులు నింపుకుంటున్నారు. పలువురు రెస్టారెంట్ల నిర్వాహకులైతే మరో అడుగు ముందుకేసి ఇలాంటి జంటల కోసం ప్రత్యేక ప్యాకేజీతో కూడిన తినుబండారాలను సైతం అందిస్తున్నారు. ప్రేమ జంటలకు ప్రత్యేక ఫుడ్లను మెనూలో చేరుస్తూ ఇటు గిరాకీతో పాటు క్యాబిన్లలో గడిపిన కాలానికి సైతం అదనంగా బిల్లులు వడ్డిస్తున్నారు. బయట హోటళ్లు, పార్కులు, సినిమాహాళ్ల వంటి వాటికి వెళితే జనం దృష్టిలో పడాల్సి వస్తుందన్న భయంతో అనేక ప్రేమ జంటలు తమ కార్యకలాపాలకు ఇలాంటి వేదికలను ఆశ్రయిస్తున్నాయి. వారి అవసరాలను అవకాశంగా తీసుకుంటున్న నిర్వాహకులు వారికి అనుగుణంగా క్యాబిన్లలో ఏర్పాటు చేస్తూ, ఆ వైపుగా ఇతరులు తొంగి చూడకుండా తగు జాగ్రత్తలు కూడా చేపడుతున్నారు. ప్రేమికులకు కేటాయించిన క్యాబిన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తూ వారికి ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్న కారణంగా ఫుడ్ ఆర్డర్ అనంతరం గంటకు వంద నుంచి ఐదు వందల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే సదరు జంటలకు అందిస్తోన్న ఆహారం విషయంలో కూడా పలు హోటళ్ల నిర్వాహకులు అందినకాడికి దోచుకుంటున్నట్లు తెలిసింది. కపుల్ బిర్యాని, కపుల్ ఫ్రైడ్ రైస్, కపుల్ మండి బిర్యానీ వంటి తదితర పేర్లు పెట్టిన నిర్వాహకులు బయట వంద నుంచి నూటా యాభై రూపాయల వరకు లభించే ఒక్కో వంటకానికి ఐదు నుంచి 750 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఎవరికంటా పడకుండా ప్రేమ కలాపాలు సాగించుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుండడంతో డబ్బు విషయం ఆలోచించకుండా అనేక మంది ఇలాంటి రెస్టారెంట్లు, బేకరీలకు అలవాటు పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రేమ పేరిట ఇప్పటికే ఎన్నో దురాగతాలు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో శృతి మించే ప్రేమ కలాపాలకు ఆలవాలంగా మారుతోన్న ఇలాంటి వేదికల పట్ల పోలీసు శాఖ కన్నేయాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు అందిస్తోన్న ఆహారపదార్థాల విషయంలో తనిఖీలు నిర్వహిస్తున్న మాదిరిగానే సదరు ప్రాంతాల్లో జరుగుతున్న కార్యకలాపాలపైనా దృష్టి సారించి యువత పెడదోవ పట్టకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## దివ్యాంగుల ప్రతిభ, స్ఫూర్తి అందరికీ ఆదర్శం



**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 19 (మనం న్యూస్):** దివ్యాంగులు చాటుతున్న ప్రతిభ, స్ఫూర్తి పలువురికి ఆదర్శనీయమని నగర మేయర్ వై.సునీల్ రావు అన్నారు. వచ్చే నెల 3న దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. మహిళలు పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ వై.సునీల్ రావు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీల్ రావు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు మంచి ప్రతిభ చాటారని, వారు రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పీఈటీలు చొరవ చూపాలని అన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ నుండి పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు చదువుకునే పాఠశాలల్లో ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగ విద్యార్థులు పాడిన పాటలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు పెండ్యాల కేశవరెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు చిరుదం సురేష్, పారేళ్ల శ్రీనివాస్, శరత్ కృష్ణ, సిడిపివోలు సబిత, కస్తూరి, శ్రీమతి పాల్గొన్నారు.

# టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం





కరీంనగర్ బ్యూరో, నవంబర్ 19 (మనం న్యూస్): దివ్యాంగులు చాటుతున్న ప్రతిభ, స్ఫూర్తి పలువురికి ఆదర్శనీయమని నగర మేయర్ వై.సునీల్ రావు అన్నారు. వచ్చే నెల 3న దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. మహిళలు పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ వై.సునీల్ రావు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీల్ రావు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు మంచి ప్రతిభ చాటారని, వారు రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పీఈటీలు చొరవ చూపాలని అన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ నుండి పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు చదువుకునే పాఠశాలల్లో ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగ విద్యార్థులు పాడిన పాటలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యులు పెండ్యాల కేశవరెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు చిరుదం సురేష్, పారేళ్ల శ్రీనివాస్, శరత్ కృష్ణ, సిడిపివోలు సబిత, కస్తూరి, శ్రీమతి పాల్గొన్నారు.

# కళాభారతి మరమ్మతు పనులు పరిశీలించిన కలెక్టర్



**కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 19(మనం న్యూస్):** నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియం ఆధునీకీకరణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్‌పమేలా సత్పతి పరిశీలించారు. ఆడిటోరియంలో లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు పనులను, వేదికను, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ప్రేక్షకుల సీట్ల సంఖ్య, ఏర్పాటు చేయబోయే వివిధ సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు సంబంధించి డివిజనల్ ఇంజనీర్ యాదగిరికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డివిజనల్ ఇంజనీర్ యాదగిరి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలో చేసిందేమిలేదు

● **బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 19 (మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఉద్ధరించిందేమీ లేదని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. మంగళవారం కరీంనగర్ లోని బిజెపి జిల్లా శాఖ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడానికి , ప్రజలకు అండగా నిలవడానికి బిజెపి శ్రేణులందరూ సమాయత్తం కావాలన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు , డిక్లరేషన్లు ఏమయ్యాయని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలని ఏ ఒక్క గ్యారెంటీ ని కూడా పూర్తిస్థాయిలో సక్రమంగా అమలు చేయలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఏడాది పాలన తో ఏ ప్రజానీకానికి మేలు జరగలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. అధికారం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ రోజుకో నాటకంఆడుతుందన్నారు .మొదట్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపి కేసుల పేరిట రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ సర్కార్ ఆ అంశాలను పక్కదారి పట్టించిందన్నారు. ఆ తర్వాత డ్రగ్స్, హైడ్రా లాంటి అంశాలను తెరపైకి తెచ్చిందని, నేడు కులగణన సర్వే పేరిట రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం పనిచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు ఆ విషయాన్ని మరిచిందన్నారు. ప్రజా పాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించిందే తప్ప ప్రజలకు కాంగ్రెస్ చేసింది ఏమీ లేదన్నారు. , ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ తీరును ఎండ గట్టి, ప్రజలందరికీ న్యాయం జరిగే వరకు బిజెపి తగిన పోరాటాలు చేస్తుందనీ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యురాలు బోడిగ శోభ, మాజీ జిల్లా అధ్యక్షులు భాససత్యనారాయణ రావు, మాజీ మేయర్ డి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, గుగ్గిల రమేష్ , ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి , బూట్ల రాజేంద్రప్రసాద్, కొరటాల శివరామయ్య, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, రంగు భాస్కరాచారి, గుర్రాలవెంకటరెడ్డి, ఎర్రబెల్లి సంపత్ రావు, పుప్పాల రఘు , దండు కొమరయ్య, కరివేద మహిపాల్ రెడ్డి, నరసింహ చారి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, శ్రవణ్ , రాజు, ప్రవీణ్ రెడ్డి లతోపాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు, చెడు వ్యసనాలకుదూరంగా ఉండాలి

సైదాపూర్, నవంబర్ 19(మనం న్యూస్): సైదాపూర్-విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని డ్రగ్స్ తో భవిష్యత్తు అంధకారం అవుతుందని హుజురాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం కాన్షియస్ నెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి





అధ్యక్షతన పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వినోద్ కుమార్ మాట్లాడుతూ, డ్రగ్స్ వాడడం ద్వారా అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడి డ్రగ్స్ కోసం పైసలు లేకుంటే దొంగతనాలు దోపిడీలకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థి దశ నుండి దురాలవాట్లకు దూరంగా ఉండి మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలను అడియాశలు చేయకూడదని అన్నారు. డ్రగ్స్ మాఫియా తొమ్మిదవ పదవ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులను టార్గెట్ చేసి డ్రగ్స్ ను అలవాటు చేస్తారని అన్నారు. ఒకప్పుడు పట్టణాలలో ఉండే డ్రగ్స్ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు రావడం చాలా బాధాకరమని అన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు. సమాన వయస్సు వారితో మాత్రమే స్నేహం చేయాలని పెద్దవారితో స్నేహం చేస్తే దురలవాట్లకు అలవాటుపడే అవకాశం ఉందని అన్నారు. డ్రగ్స్ వాడితే భవిష్యత్తులో మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి, ఉపాధ్యాయులు రాగూర్ శాంత కుమార్ సింగ్, బైరి సుధాకర్, హన్మాండ్ల భాస్కర్, రవీందర్ రెడ్డి, హరియా, చిరంజీవి, సుజాత, నిర్మల, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, సంతోష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటనతో టెక్స్‌టైల్ పార్కు సంక్షోభం వీడేనా..?

●ఎదురుచూస్తున్న పవర్లూమ్ వర్కర్లు ●ఇప్పటికే మూత పడ్డ వస్త్ర పరిశ్రమ

**తంగళ్ళపల్లి, నవంబర్ 19 (మనంన్యూస్):** ప్రజా విజయోత్సవాలలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని సభలో ప్రసంగించనున్నారు. కానీ అంత బాగానే ఉన్న తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని టెక్స్‌టైల్ పార్కు భవిష్యత్తు మాత్రం మారడం లేదని నేతన్నలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన టెక్స్టైల్ పార్కు నేడు సంక్షోభంలో కూరుకుపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్ట మొదటి టెక్స్ టైల్ పార్క్ ను 65 ఎకరాల్లో ఇక్కడ ఏర్పాటు చేశారు. గతంలో టెక్స్ టైల్ పార్క్ లోని విద్యుత్ యూనిట్లకు 50 శాతం సబ్సిడీపై విద్యుత్ సప్లై చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో విద్యుత్ రాయితీని రీయింబర్స్మెంట్ గా అందించారు. ప్రస్తుతం సబ్సిడీ లేక పెరిగిన విద్యుత్ ఛార్జీలతో నేసిన బట్టకు గిరాకీ లేక, ప్రభుత్వ ఆర్డర్స్ రాక, ఆర్థిక ఇబ్బందులతో





పరిశ్రమను పార్కు అధ్యక్షుడు అన్నాల్దాస్ అనిల్ కుమార్ ఆద్వర్యంలో గత నెల నుంచి బంద్ చేశారు. వస్త్ర పరిశ్రమ బంద్ కావడం ఈ సంవత్సరం ఇది రెండోసారి. కాగా ప్రస్తుతం పరిశ్రమ మూగబోయి నేతన్నలు ఆందోళ చెందుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన వారి బ్రతుకులు మారుతాయని గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్న నేతన్నలు. మళ్ళీ ఇప్పుడు సిరిసిల్ల 'ఉరి' సిల్ల గా మారుతుంది. పని లేక వస్త్ర పరిశ్రమ కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. ఆ బాధలో వారు ఏం చేస్తున్నామో మరిచి ఉరి కొయ్యలకు వేలాడుతున్నారు. కాగా జిల్లాకు వస్తున్న సిఎం రేవంత్ రెడ్డి టెక్స్ టైల్ పార్కు ను సందర్శిస్తే బాగుంటుందని నేతన్నలు కోరుతున్నారు. సిఎం పార్కు కు వస్తేనే కార్మికుల బాధలు నేరుగా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి టెక్స్ టైల్ పార్కును సందర్శిస్తారా..!, నేతన్నల ఆశలు నెరవేరుతాయా..?, సంక్షోభం నుండి పార్కు తెరుకుంటుందా..? అని నేతన్నల ఆశలు నెరవేరుతాయో వేచి చూడాలి.

# యువతను మతోన్మాద మత్తులో ముంచుతున్న బిజెపి

●లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
●సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**సిరిసిల్ల టౌన్, నవంబర్ 19(మనం న్యూస్):** బిజెపి హిందుత్వ సిద్ధాంతం కాదని, కేవలం ఆదానీ అంబానీ వంటి అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమేనని, అసలైన హిందువులకు ఐదు పైసలు మేలు జరగదని రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోట్లు తీసుకొచ్చి కార్మికుల పొట్టలు కొడుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. బిజెపి 10 ఏళ్ల పాలనలో దేశం విధానాలను పక్కనపెట్టి వ్యక్తిగత దూషణలతో పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు, రాష్ట్ర నాయకులు కూరపాటి రమేష్, సిపిఎం జిల్లా కమిటీ





బిజెపి ఆడుతున్న మతోన్మాద దుష్టపన్నాగాలను ప్రజలు తిరస్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యులు తమ్మినేని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా మూడవ మహాసభలలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరభద్రం, ప్రజాస్వామ్య లౌకిక శక్తులను బలపరుస్తూ దేశ సమైక్యత సమగ్రతల కోసం మతసామరస్యం కోసం దేశ ప్రజలు ఐక్యంగా నిలబడాలన్నారు. ఎదేళ్ల కాలంలో బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు10 పైసల మేలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగ యువతరాన్ని మభ్యపెట్టి కోట్లు దండుకొని మోసగించిందన్నారు. కార్మిక చట్టాలను జిడిపి బాగా దిగజారింన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల మణిపూర్ రాష్ట్రం నేటికీ మండుతూనే ఉందని మానవ మారణ హోమం జరుగుతుందని ప్రధానమంత్రి పెద్ద కర్కోట ఒక్కసారి కూడా తొంగి చూడలేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేసేందుకు గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. తీవ్ర నిర్బంధం పెట్టి రైతులపై ఉక్కు పాదం మోపడం సరికాదన్నారు. కలెక్టర్ పై దాడిని తమ పార్టీ ఖండిస్తుంది కానీ ఆ పేరిట అమాయక రైతులను దళితులు గిరిజనులు బలహీనవర్గాలపై పోలీసు నిర్బంధం పెరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కేటీఆర్ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, గన్నేరం నరసయ్య, కోడం రమణ, మల్లారపు అరుణ్ కుమార్, ముక్తి కాంతా అశోక్, ఎర్ర వెల్లి నాగరాజు, గురిజాల శ్రీధర్, సూరం పద్మ, మల్లారపు ప్రశాంత్, శ్రీరామ్, సదానందం, పట్టణ కార్యదర్శి అన్నదాసు గణేష్, ప్రజా సంఘాల నాయకులు మల్యాల నర్సయ్య, సిరిమల్లె సత్యం, గుండు రమేష్, సురేష్, గాంతుల మహేష్, మంద అనిల్ ,కూర రాకేష్, మనోజ్, రమేష్ చంద్ర ,నక్క దేవదాస్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి



**చిగురు మామిడి,నవంబర్ 19 (మనం న్యూస్):** చిగురుమామిడి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న రోగులను పరిశీలించి వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను,ఏ ఎమ్ ఆర్ అవగాహన కార్యక్రమాల గురించి మండల వైద్యాధికారి దాస్ ను అడిగి తెలుసుకున్నారు.మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా పలు సూచనలు సలహాలు చెప్పారు.హాజరు పట్టికను, పరిశీలించి,ఆస్పత్రి ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## ●రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్,నవంబర్ 19,(మనం న్యూస్)ఃమహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో కలిసి సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.



సెట్విన్ శిక్షణ కేంద్రంలో కుట్టుమిషన్ సెంటర్, బ్యూటిషన్ సెంటర్, కంప్యూటర్ ల్యాబ్, ఐటిఐ మెకానిక్స్ సంబంధిత సెంటర్‌లను ప్రారంభించారు. స్వయంగా కుట్టుమిషన్ పై కూర్చొని శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మహిళల్లో మంత్రి పొన్నం ఉత్సాహం నింపారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంత మహిళలు ఎవరి కాళ్ళ మీద వారు నిలబడేలా తయారు కావాడానికి కుట్టమిషన్, బ్యూటిషన్, కంప్యూటర్ ల్యాబ్, ఎమ్.ఎస్.ఆఫీసు, అకౌంటెంట్ ఉన్నాయన్నారు. అందులో నైపుణ్యం సాధించి మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యూటీషన్ కోర్సు వస్తుందని మహిళలకు ఆదాయ మార్గంగా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత కోసం ఎలక్ట్రిక్ మెకానిక్ శిక్షణ కోర్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ నిరుద్యోగ యువత శిక్షణ తీసుకుంటే వారికి ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదన్నారు. మహిళలు కుటుంబాన్ని నిలబెట్టుకుని భర్తకు సహకారంగా పిల్లలకు, చదువులకు ఇబ్బంది లేకుండా అండగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ప్రతి మహిళ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందాలన్నారు. గిరిధర్ రెడ్డి చైర్మన్‌గా నియామకమైన తర్వాత సెట్విన్ శిక్షణ కేంద్రాలు హైదరాబాద్‌లో 19, జిల్లాల్లో నాలుగు సెట్విన్ శిక్షణ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు.



జహీరాబాద్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నల్గొండలో కూడా కొత్తగా సెట్విన్ విక్షణ కేంద్రాలు రానున్నాయని తెలిపారు. ఇంట్లోనే కూర్చొని ఆదాయం పెంచుకోవడానికి సెట్విన్ వివిధ రకాల శిక్షణ అందిస్తుందన్నారు. అంతకు ముందు మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ మానాల మోహన్, సెట్విన్ ఎం.డీ.వేణుగోపాల్, అడిషనల్ కలెక్టర్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి,

కౌన్సిలర్‌లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సెట్విన్ ప్రతినిధులు, తదితరులున్నారు.

# రైతుల సౌకర్యార్థమే కొనుగోలు కేంద్రాలు

● సివిల్ సప్లై కమీషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్



**కొండపాక, నవంబరు 19(మనం న్యూస్):** రైతుకు గిట్టుబాటు ధర అందించి వారికి ఇబ్బందులు లేకుండా చేయడం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సివిల్ సప్లై కమీషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోలు రికార్డులను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదనే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తూకమైన తర్వాత డబ్బులు ఎన్ని రోజుల్లో పడుతున్నాయని తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో నుంచి ధాన్యం తూకం చేసిన రైతుతో ఫోన్ లో మాట్లాడి డబ్బులు పడ్డాయా అని అడిగారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయించవద్దని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, డీఎస్ఓ తనూజ, తాసిల్దార్ దిలీప్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ ఉత్తదితరులు ఉన్నారు.

# పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు దూరం

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 19(మనం న్యూస్)ః ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస ప్రాంతాలు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను దూరంగా ఉంచవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహశిల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు మంజూరైన ప్రొసీడింగ్ ను అందజేశారు.అనంతరం హాజీపూర్ మండల కేంద్రం, కర్ణమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం



కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు చెల్లించడం జరుగుతుందని, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, త్రాగునీరు, నీడ, గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా విజయోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్

నాగర్ కర్నూల్, నవంబర్ 19(మనం న్యూస్) :తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కళాయాత్ర మంగళవారం ప్రారంభమైంది. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో వాహనాన్ని ప్రత్యేకంగా ఫ్లెక్సీ బ్యానర్లతో సిద్ధం చేయగా మంగళవారం నాగర్ కర్నూల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జెండా ఊపి కళాయాత్ర వాహనాన్ని ప్రారంభించారు. ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలు డిసెంబర్ 7వ తేదీ దాకా జిల్లాలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలైన మహాలక్ష్మి, ఇందిర మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, స్కిల్ డెవలప్మెంట్ పై నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీలతో పాటు, 20 మండలాల్లోని మండలానికి మూడు గ్రామాల చొప్పున ఎంపిక చేసిన మేజర్ గ్రామపంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ కళాకారులు ప్రచారం చేయనున్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7వ తేదీ నాటికి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సంస్కృతిక కళాకారులు జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, డిపిఆర్ఓ కార్యాలయ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాజాత బృందం సభ్యులు భాస్కర్, శివ, జెల్లి కృష్ణ, పార్వతమ్మ, శైలజ పాల్గొన్నారు.



# కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం

## ●దీప కాంతులతో కోమటి చెరువు కళకళ
## ●హాజరైన ఎంపీ రఘునందన్ రావు

**సిద్దిపేట, నవంబర్ 19, మనం న్యూస్ ప్రతినిధి:** కార్తీక మాసం సందర్భాన కోమటి చెరువు కార్తీక దీపాలతో కాంతులీనింది. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలతో కోమటి చెరువు ప్రాంగణమంతా జనసంద్రాన్ని తలపించింది. శివయ్యకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం, అదేవిధంగా మంగళవారం కావడంతో హనుమాన్ కు తమలపాకుల అర్చన, అమ్మవారికి కుంకుమ పూజ, సంకటహరచతుర్థి కావడంతో వినాయకుడికి గరిక పూజ, శివయ్యకు అభిషేకము, గోమాతకు పూజలు వంటి కార్యక్రమాలతో కోమటి చెరువు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జ్ దూది శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో తొలిసారిగా నిర్వహించిన కార్తీక దీపోత్సవం గ్రాండ్ సక్సెస్ అయింది. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై వివిధ దేవతా మూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేయడంతోపాటు చివరగా నీటిలో అరటి బోదెల్లో దీపాలను విడిచి మొక్కుకున్నారు. సాయంసంధ్య వేళ కోమటి చెరువు కట్టపై జరిగిన ఈ కార్యక్రమంతో దీపాల వెలుగుల్లో కోమటి చెరువు సరికొత్త శోభను సంతరించుకుంది. గత మూడు రోజులుగా దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పట్టణంలోని మహిళలతోపాటు ఆయా దేవాలయాల్లోని మహిళా గోష్టి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్తీక మాసం వేళ నీటిలో దీపాలను విడవడం ద్వారా శివయ్యకు అభిషేకం చేయడం ద్వారా ఎంతో పుణ్యం కలుగుతుందన్న నానుడి ఉండడంతో ఆ భాగ్యాన్ని పొందేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చింది మహిళా లోకం.

**-ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో రావిచెట్టు హనుమాన్ దేవాలయ అర్చకులు కృష్ణమాచార్యులు, హరినాధ శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన, స్వర నీరాజనం వారి సంగీత విభావరి ఎంతగానో అలరించింది.హిందూ ధర్మం నేడు దేశం దాటి ప్రపంచ వ్యాప్తమవుతుందంటే దానికి మహిళామణులే కారణమని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు అన్నారు. ధర్మానికి నష్టం వాటిల్లిన ప్రతీసారి ముందడుగు వేసి నేడు ప్రపంచంలోని ఏ దేశంలో కూడా పూజ జరిగినా గణపతి పూజ జరగకుండా ఉండడం లేదంటే అతిశయోక్తి కాదు. ఎంతో మంది దేశంలో ధర్మాన్ని అడ్డుకోవాలని చూసినా బలంగా నిలబడుతుండడానికి స్ఫూర్తి మహిళలు అన్నారు.

**ధర్మ రక్షణ అందరి బాధ్యత: దూది శ్రీకాంత్ రెడ్డి**



హిందూ ధర్మ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్తీక దీపోత్సవం నిర్వాహకులు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా దేవాలయాల్లో అన్య మతస్తుల ప్రవేశాన్ని అడ్డుకోవాలని, ధర్మం కోసం సంఘటితంగా నిలబడాలన్నారు. అమ్మాయిలకు గురువులు మాతృమూర్తులేనని, వారిని ధైర్యంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, బాసంగారి వెంకట్, నాయకులు విభీషణ్ రెడ్డి, బాలేష్ గౌడ్, తొడుపు నూరి వెంకటేశం, డి.ఎస్.ఆర్. టీమ్ సభ్యులు రాజిరెడ్డి, రేణుక ప్రసాద్, శశి, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం సేకరించాలి



**సిద్దిపేట, నవంబర్ 19, మనం న్యూస్ ప్రతినిధి:** రైతులు ప్రైవేటు వ్యాపారస్తుల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ డి. ఎస్. చౌహాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి గజ్వేల్ మార్కెట్ యార్డుతోపాటు కొండపాక మండలం దుద్దెడలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమశాతం స్వయంగా వరిశీలించి రైతులతో నేరుగా ఫోన్ లో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో కల్పిస్తున్న వసతుల గురించి ఆరా తీసారు. అనంతరం కలెక్టరేట్ లో అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వానాకాలంం పంటలో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే 90 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం జిల్లాలోని 419 కొనుగోలు కేంద్రాలకు రాగా ఇప్పటి వరకు 171 కోట్ల 56 లక్షల విలువైన 73947 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేసి టాబ్ ఎంట్రీలు చేయాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యాన్ని పండించడానికి రైతులను ప్రోత్సహించిందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సన్న రకం వడ్లు అధికంగా పండాయన్నారు. జిల్లాలో 66 కేంద్రాల ద్వారా సన్నరకం వడ్లు కొనుగోలు చేస్తున్నందున రైతులు ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించకుండా ఉండి రూ.500 బోనస్ పొందేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిసిఎస్ఓ తనూజ, డిఎం సివిల్ సప్లై ప్రవీణ్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల అభివృద్ధికి కృషి ఃమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**హుస్నాబాద్,నవంబర్ 19,(మనం న్యూస్)ః** సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తాను అని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ది హుస్నాబాద్ విశాల సహకార పరపతి సంఘం నూతన కార్యాలయ భవనం, 1200 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. విశాల సహకార పరపతి సంఘం ప్రాంగణంలో సంఘ వ్యవస్థాపకులు బొప్పరాజు లక్ష్మీకాంతరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా వారం రోజుల పాటు ఈ సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. బొప్పరాజు లక్ష్మీకాంతరావు మనందరికి ఆదర్శం అన్నారు. భవిష్యత్తు తరాలకు ఆయన స్ఫూర్తి అని కొనియాడారు. సహకార సంఘాలను గతంలో నమ్మే పరిస్థితి లేదన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో మూడున్నరేళ్లలో మార్క్‌ఫెడ్ సంస్థలో పొన్నం ప్రభాకర్ పేరు ఉండేలా పని చేసాను అన్నారు. దేశంలో క్రిబ్కో డైరెక్టర్ ఉండి రైతుల పక్షాన ముందుకు పోతున్నాను అన్నారు. హుస్నాబాద్ సహకార సంఘాన్ని అనేక రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను అన్నారు. సహకార సంఘాలు నా రాజకీయ ఎదుగుదలకు తొలిమెట్టు అన్నారు. సహకార సంఘాల్లో అందరిని కలుపుకుని పోవాలన్నారు. సభ్యులు ఎక్కువగా ఉండి లోన్ తీసుకునే వారు తక్కువ ఉంటే ఏం లాభం అన్నారు. బొప్పారాజు లక్ష్మీకాంతరావు సర్పంచ్‌గా మూడుసార్లు ఎమ్మెల్యేగా, హుస్నాబాద్ తొలి శాసనసభ్యుడిగా వెంకట్‌రెడ్డి, చొక్కారావు బొప్పరాజు, దేశిని చిన్నమల్లయ్య, బొమ్మవెంకన్న, ప్రవీణ్‌రెడ్డిలు ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడ్డారని

గుర్తు చేసారు. బొప్పరాజు లక్ష్మీకాంతరావు, దేశిని చిన్నమల్లయ్య, బొమ్మ వెంకన్న విగ్రహాలను నాగారం చౌరస్తాలో ఏర్పాటు చేసి చౌక్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. బొప్పరాజు లక్ష్మీకాంతరావు నివాసంను అందరికీ ఉపయోగపడేలా చేస్తామన్నారు. చరిత్రను మర్చిపోతే భవిష్యత్తు మనల్ని అందకారంలోకి నెడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాం అన్నారు. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేసాం అన్నారు. 110 కోట్ల మంది మహిళల రూ.3700 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేసారన్నారు. అక్కన్నపేట మండలం నాయకుల ప్రతిపాదన మేరకు అక్కడ పరిశ్రమలు పెట్టాలనుకున్నాం అని తెలిపారు. మీ అందరి సహకారంతోనే అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం తప్ప దౌర్జన్యంగా వ్యవహరించమని చెప్పారు.



## గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ఖమ్మం, నవంబర్ 19(మనం న్యూస్): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా ఖమ్మంలోని కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ముగ్గుల పోటీలు, చైర్స్ పోటీలు హైస్కూల్ స్థాయి విద్యార్థిలకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ , డిప్యూటీ మేయర్ పాతిమ జోహార్, జిల్లా పంచాయితీ ఆఫీసర్ ఆశాలత హాజరయ్యారు. మహిళలు అనేక రంగాలలో దూసుకు పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, గ్రంథాలయ యూనియన్ అధ్యక్షులు కె.వి.ఎస్.ఐ.ఎన్ రాజు , కార్యదర్శి ఎండి ఇమామ్ , ఆఫీస్ స్టాఫ్ భాస్కర్, కనకవల్లి, ఎస్ లలిత కుమారి, కె.రవి, బి.బాబు, విజయ కుమారి, రోజా, కిషోర్, సిహెచ్ శ్రీనివాస్, యం.రోహిత్, మల్లిఖార్జున తదిత రులు పాల్గొన్నారు .

## సమగ్ర కుటుంబ సర్వే పై సమీక్షా సమావేశం

### చండూర్ ఆర్డివో శ్రీదేవి

**మర్రిగూడ, నవంబర్ 19(మనం న్యూస్):**సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని చండూరు ఆర్డీవో వి.శ్రీదేవి ప్రజలను కోరారు.మంగళవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సూపర్వైజర్ల సమీక్ష సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు.మండలంలో మొత్తం కుటుంబాలు 11097 ఉండగా సోమవారం వరకు 9947 కుటుంబాల సర్వే పూర్తయినట్లు (89.69 శాతం) తెలిపారు.మిగతావారు కూడా సర్వేకు సహకరించాలని సూచించారు.ఎన్యూమరేటర్లు పూర్తిచేసిన ఫామ్స్ ని పరిశీలకులు ఆకస్మాత్తుగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వాటిని ఆన్లైన్లో నమోదు కొరకు 36 మంది సిబ్బందిని 28 కంప్యూటర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ సమావేశం లో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, తాహసిల్దార్ బి.శ్రీనివాస్, ఎంపిడివో మునయ్య, రవికుమార్, శ్రీనివాసులు, ప్రభాకర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

### టిపిసిసి నాయకులు బట్టు జగన్ యాదవ్

**మునుగోడు, నవంబర్ 19(మనం న్యూస్):** స్థానిక సంస్థలో బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఎలాంటి రాజ్యాంగ,న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని టీవీ, పత్రికలో ప్రకటనలు ప్రచురించి పూర్తిస్థాయిలో కుల గణన సర్వే జరిపి ఇప్పటివరకు సర్వేలో పాల్గొనని ప్రజలకు ఒకరోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించి పూర్తిస్థాయిలో సర్వే జరపాలని మండల కేంద్రంలో ఒక డేస్క్ ఏర్పాటు చేయాలనీ ఎలాంటి ఒత్తిళ్లకు తలోగ్గకుండా శాస్త్రీయంగా లోతుగా అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని స్థానిక సంస్థల రిజర్వేషన్ల పెంపు విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన డేడికేషన్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావును మంగళవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

# పైసా కొట్టు.. ఉపాధి పట్టు

- సింగరేణిలో భూనిర్వాసితులకు మొండిచేయి
- కాసులిస్తేనే ఉపాధి అవకాశాలు
- కాళ్లరిగేలా తిరిగినా నిర్వాసితులను పట్టించుకోని అధికారులు

**మణుగూరు, నవంబర్ 19(మనం న్యూస్):** సింగరేణిలో ఓపెన్ కాస్ట్ ల విస్తరణలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు భూ సేకరణ సమయంలో అధికారులు ఇస్తున్న హామీలకు క్రమక్రమంగా చరమగీతం పాడుతున్నారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులు చెప్పులరిగేలా తిరుగుతున్నా పైరవీలకు, ఆర్థిక ప్రయోజనం చేకూర్చిన వారికే ప్రాధాన్యతనిస్తూ ఉపాధి కల్పిస్తుండటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జీఎం కార్యాలయం చుట్టూ ఉపాధి కల్పించండి మహాప్రభో అంటూ నిర్వాసితులు సర్టిఫికెట్లు పట్టుకుని తిరుగుతున్నా అవేమి అధికారుల చెవులకు వినిపించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మణుగూరులో కాంట్రాక్ట్ దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ రన్నింగ్ పోటీ పెట్టి అర్హత అయిన వారిని తప్పించి భూ నిర్వాసితులైనా పక్కన పెట్టి ఒక్కో పోస్టును అక్షరాల లక్షకు బేరం పెట్టి సింగరేణి ఔన్నత్యాన్ని బేరం పెట్టడమే అందుకు నిదర్శనంగా తెలుస్తోంది.

**అవకాశాలు తూ..తూ మంత్రమే...**

భూ సేకరణ సమయంలో భూమి, నివాసం, ఆప్యాయంగా పెంచుకున్న పశువులను సైతం అమ్ముకుని సర్వం కోల్పోతున్న నిర్వాసితుల కుటుంబీకులకు సింగరేణి కాంట్రాక్ట్ విభాగాల్లో తొలి ప్రాధాన్యత కల్పించాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కంపెనీల్లో మాత్రం కాంట్రాక్ట్ దక్కించుకున్న వారే కాసులకు బేరం పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. స్కిల్ బేసిక్ లో ఖాళీలకు అర్హత ఉన్న పోస్టులకు పోటీ అధికం కావడంతో కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మకై పక్కదారి పట్టిస్తూ ఉపాధి కావాలి అంటూ తిరుగుతున్న నిర్వాసితులకు మొండిచేతులు చూవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.




**కానులిస్తేనే పోస్టులు...**

సింగరేణి కాలరీస్ మణుగూరులోని కాంట్రాక్టు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు కాసులిచ్చిన వ్యక్తులనే వర్కర్లుగా పెట్టుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టెండర్ ప్రారంభమైన నాటి నుంచి చెప్పులరిగేలా తిరుగుతున్న నిర్వాసితులకు పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి అయ్యే నాటికి స్పందిస్తూ అక్కడ ఖాళీ లేవు మరోచోట అవకాశాలు కల్పిస్తాం అంటూ... వేతనాలు అధికం, ఎక్కువ కాలం టెండర్ ఉండే కాంట్రాక్ట్ కంపెనీల్లో పోస్టులు పక్కదారిలో అవకాశాలు కల్పిస్తున్నారని తెలుస్తోంది. అధికారులకు మొర పెట్టుకున్నా వివిధ మార్గాల ద్వారా ఆక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తున్నా పట్టింపు లేకుండా ప్రవర్తించడం అధికారుల భాగస్వామ్యం ఉందన్న ఆరోపణలు లేకపోలేదు.

**చర్యలు తీసుకుంటాం : డీజీఎం పర్సనల్ రమేష్**



సంస్థలో ఎలాంటి అవకతవకలు జరగవని సింగరేణి సంస్థలో ప్రతిదీ పారదర్శకంగా జరుగుతుందని ఇలాంటి మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. భూ నిర్వాసితులకు తప్పక ఉపాది అవకాశాలు సింగరేణి కల్పిస్తుందని దళారులు ఎవరైనా ఉంటే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భూ నిర్వాసితులు ఎవరైనా ఉంటే సంస్థ వారికి తప్పక ఉపాధి కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

# ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు




### అవగాహన కల్పించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, నవంబర్ 19(మనం న్యూస్):** ర్యాగింగ్ కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. యాంటీ ర్యాగింగ్ చట్టంపై ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ విద్యార్థులకు డిస్ట్రిక్ట్ లిగల్ సర్వీసెస్ అధారిటీ జడ్జి చంద్రశేఖర్‌తో కలసి మంగళవారం అవగాహన కల్పించారు. మెడికల్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన ఈ సెమినార్ కార్యక్రమానికి హజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. విద్య వ్యవస్థలో ర్యాగింగ్ పై నిషేధం ఉందని స్పష్టం చేశారు. ర్యాగింగ్ కు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఎవరైనా ర్యాగింగ్ లు చేసిన ఎలాంటి ఇబ్బందులు పెట్టిన వెంటనే ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. చట్టాన్ని తెలుసుకొని మసులు కోవడం మూలంగా భవిష్యత్కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆనందంగా ఉండవచ్చన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసంపై దృష్టిని నిలిపి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకోరావాలన్నారు. తోటి విద్యార్థినుల పట్ల సోదరభావంతో కలిసిమెలిసి విద్యనభ్యసించాలని, అత్యుత్సాహానికి పోయి జైలు పాలై జీవితాలను అంధకారం చేసుకోవద్దని సూచించారు. చట్ట ప్రకారం ర్యాగింగ్ శిక్షార్హమని అన్నారు. సీనియర్స్, జూనియర్స్ పట్ల ర్యాగింగ్కు పాల్పడం చట్టాన్ని అతిక్రమించినట్లే అవుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

# అపర కర్మల భవన నిర్మాణం కోసం విజ్ఞప్తి



**మధిర, నవంబర్ 19(మనం న్యూస్):** మధిర మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో మధిర పట్టణంలో అపర కర్మల భవనం లేక చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ గమనించి మరమ్మత్తులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, గతంలో శివాలయం రోడ్‌లో ఉన్న కేతేపల్లి రాజేశ్వరరావు, జయలక్ష్మి పేరు మీద ఉన్న అపర కర్మల భవనాన్ని పునరుద్ధరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. బీద ఆర్యవైశ్యులు అద్దెకు నివాసం ఉండే ఇళ్లల్లో అపరకర్మల కోసం అనుమతించకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్యవైశ్యులే కాక హిందూ సమాజమంతా కూడా శ్రాద్ధ కర్మలు చేసుకునేందుకు అపరకర్మల సత్రం లేక చాలా ఇబ్బంది పడుతున్న విషయం అధికారుల దృష్టికి, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సదరు విషయాన్ని గమనంలోనికి తీసుకొని మున్సిపాలిటీ అధికారులు, రాజకీయ నాయకులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల నరసింహమూర్తి, కోశాధికారి చెడే రామకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మహంకాళి వెంకట శ్రీనివాసరావు, మధిర పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వంగవేటి రాజశేఖర్, కోశాధికారి వేములపల్లి శ్రీనివాసరావు, మాజీ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లబోతు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి పంటను తనిఖీ చేసిన వ్యవసాయ శాఖ అధికారులు

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 19 (మనంప్రతినిధి):** మిర్చి పంటలోని కలుపు నివారణ కోసం మందు కొడితే , మిర్చి మొక్కలు చనిపోతున్న సందర్భంలో, పురుగు మందు దుకాణదారుడిని సంప్రదించిన అనంతరం, మండలం వ్యవసాయ శాఖ అధికారులకు రైతు ఫిర్యాదు చేసాడు. జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామంలో రోకటి సుధాకర్ అనే రైతు మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. మిర్చి నాటి రెండు నెలల 15 రోజులు అవుతున్న నేపథ్యంలో నెల రోజుల క్రితం మిర్చి తోటలో కలుపు ఉందని జూలూరుపాడులోని ఓ పురుగుల మందుల షాపు వారు కొత్తగా వచ్చిన మందు అని ఇచ్చారని, తోటకి ఎటువంటి అనర్థం జరగదని మందు ఇచ్చారని, కానీ ఆ మందు వాడటం వలన మిర్చి తోటలోని మొక్కలు చనిపోతున్నాయని, ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనందుకు ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదు మేరకు మిర్చి పంటను కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి. లక్ష్మీనారాయణ, ఉద్యాన వన శాస్త్రవేత్త బి. శివ, మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్, వ్యవసాయ విస్తరణాధికారి గోపికృష్ణ పంటను పరిశీలించారు. దీని యొక్క నివేదిక రెండు మూడు రోజుల్లో తెలుస్తుందని వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్ తెలియజేసారు.



## మండలంలో కొనసాగుతున్న సర్వే

**కారేపల్లి, నవంబర్ 19(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటి కుటుంబ సర్వే మండలంలో కొనసాగుతోంది. మంగళవారం కారేపల్లి లోని శివాలయం వీధిలో ఎన్యూమరేటర్ జాకీర్ బాబా సర్వే నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన ప్రత్యేకమైన నమూనా పుస్తకంలో, కుటుంబ యజమానుల నుండి వివరాలు సేకరించి ప్రశ్నలకు సంబంధించిన కోడ్ లను నమోదు చేశారు. ఈ సందర్భంగా జాకీర్ బాబా మాట్లాడుతూ సర్వేకి ప్రజలందరూ సహకరిస్తున్నారని, స్వచ్ఛందంగా వారి వివరాలను వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పూర్తిగా సర్వే యొక్క వివరాలను సంబంధిత కుటుంబాలు యజమాని, సభ్యులకు వెల్లడించి వారి నుంచి ప్రభుత్వం పేర్కొన్న సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తిగా సర్వేలో పేర్కొన్న ప్రశ్నలన్నీ 8 పేజీలు పుస్తకంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. అడిగిన ప్రశ్నలన్నింటికీ ఓర్పుతో సమాధానం ఇస్తూ సర్వేను పూర్తి చేస్తున్నామన్నారు. సూపర్వైజర్ కేటాయించిన లక్ష్యం దాదాపు పూర్తి కావచ్చిందన్నారు.

# రాముని సేవలో తరంచని వారికి అధ్యక్ష పీఠమా!

- ఉనికిని కోల్పోతున్న నేపథ్యంలో సేవ భావం ఉన్నవారు అర్హులు
- భక్తితో కాదు...భుక్తి కోసం ప్రయత్నాలు
- రాజకీయ నాయకులను అధ్యక్ష పదవికి దూరంగా ఉంచాలి
- స్థానికులకే అవకాశం కల్పించాలని రామ భక్తుల డిమాండ్



**భద్రాచలం ,నవంబర్ 19 (మనం న్యూస్):** దక్షిణ అయోధ్యగా విరాజులుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలు వలన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోందనే విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టలేదు. అంతేకాదు దేవస్థానం అభివృద్ధికి వంద కోట్లు నిధులు కేటాయిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీని నిలబెట్టుకోగా పోగా అసలు ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ పదేళ్లు రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో దేవస్థానం కొట్టుమిట్టాడింది. ప్రతిదీ అవినీతి, కొందరు స్వామి వారిలో నగలను దోచుకుంటే, మరికొందరు రాములవారికి వచ్చే ధనాన్ని దొంగలించిన ప్రబుద్ధులు మరెందరో. రాముల వారి పేరు చెప్పి తలాపిడిడు పంచుకున్నారు. అంతేకాదు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పేరుపై ఉన్న భూములను సైతం అక్రమార్కులు కబ్జా చేస్తుంటే, మహిళా అధికారికి పూర్తిగా సహకరించిన వారు మరి కొందరు. దేవస్థానం ఈవో రమాదేవి స్వామి వారి ఆస్తులు, ఆచారాలను కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ, పురుష అహంకారంతో కొందరు అడ్డుపడుతున్నట్లు గతంలో అనేక ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి సందర్భంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పాలకమండలి అధ్యక్ష పదవికి చాలామంది రాజకీయ నాయకులు పోటీపడుతున్న సంగతి తెలిసిందే. రాముడి సేవలో ఒక్కరోజు కూడా గడపని వారు దేవాలయం అభివృద్ధికి ఎలా పాటుపడతారని రామ భక్తులు ప్రశ్నిస్తున్నారు. నవంబర్ 11న మనం దినపత్రికల్లో ' పాలకమండలి లేక పదేళ్లు' అనే కథనాన్ని ప్రచురించింది. వేలాది మంది భక్తులు ఆ కథనాన్ని చదివి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పాలకమండలి అధ్యక్ష పదవి స్థానికులకే ఇవ్వాలి, నిత్యం స్వామి వారిని కొలుస్తున్న భక్తులకే అధ్యక్ష పీఠ కేటాయించాలని రామభక్తులు డిమాండ్ చేస్తున్నారు. అధ్యక్ష పీఠం వలసవాదులకు, రాజకీయ నాయకులకు కేటాయిస్తే రామయ్య ఆస్తులపై కన్నేసే ప్రమాదం ఉందని రామ భక్తులు భద్రాచలం పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానని 1600 ఎకరాలు భూమి ఉంది. ప్రతి సంవత్సరం రాముడు ఆదాయం సుమారు 100 కోట్ల వరకు వస్తుంది. అంతేకాకుండా భక్తులు స్వామి వారికి నగల రూపంలో కూడా కానుకలు అందిస్తారు. రాజకీయ నాయకులు అధ్యక్ష పీఠం దక్కితే ఆలయం అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. కరోనా ప్రభావము వలన దేవస్థానానికి భక్తుల రాక తగ్గుతుంది. ప్రభుత్వాలు యాదగిరిగుట్ట అభివృద్ధి వైపు దృష్టి పెట్టడంతో, దక్షిణ అయోధ్యగా పిలవబడే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో వెనుకబడే అవకాశం ఉంది. అంతేకాకుండా శ్రీరామనవమి ముక్కోటి వంటి పెద్ద పండగల సమయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడం కంటే, తమ రాజకీయ నాయకులకు, బంధువులకు ,స్నేహితులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సామాన్య భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం లేకుండా చేస్తారని రామ భక్తుల్లో వినిపిస్తున్న మాట. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు, జిల్లా మంత్రులు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ స్థానికులకే ఇవ్వాలని, అందులోనూ స్వామివారి సేవలో నిమగ్నమైన వారికే కేటాయించాలని రామభక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా పాలన కళాయాత్ర ప్రారంభం



- జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- డిసెంబర్ 7 దాకా కొనసాగనున్న కళాయాత్ర ఉత్సవాలు

**మహబూబాబాద్, నవంబర్ 19 (మనం ప్రతినిధి) :** ప్రజా పాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో వాహనాన్ని ప్రత్యేకంగా ఫ్లెక్సీ బ్యానర్ల తో సిద్ధం చేయగా, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, కే.వీరబ్రహ్మాచారి ప్రారంభించారు. ప్రజా విజయోత్సవాలు ఈ నెల 19 నుంచి డిసెంబర్ 07 వరకు జిల్లాలోని మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు మున్సిపాలిటీలు, 18 మండలాల్లోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై ప్రచారం చేయనున్నారని తెలిపారు. టీం లీడర్లు గిద్దె రాంనరసయ్య, బండ వెంకన్న, రవీందర్ గౌడ్, నేతృత్వంలో ప్రచారం చేయనున్నారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో, ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, డి సి ఓ వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డేబోయిన శ్రీనివాస్, డిహెచ్ఓ మరియన్న, డీఏవో విజయనిర్మల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవ కళాయాత్రను విజయవంతం చేయండి




## కలెక్టర్ ఆదర్శ్

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 19 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రజా పాలన ద్వారా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నవంబర్ 19 నుండి డిసెంబర్ 7 వరకు ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్ర నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వెంకటేశ్వర్లుతో కలిసి వనపర్తి ఐడిఓసి ప్రాంగణం నుంచి ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పౌర సంబంధాల అధికారి, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా పాలన ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు ఆట పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు నవంబర్ 19 నుండి డిసెంబర్ 7 వరకు రోజుకు 3 ప్రోగ్రాంల చొప్పున 57 ప్రోగ్రాములు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కళా యాత్ర ఒక నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తుందన్నారు. అదేవిధంగా డిసెంబర్ 6న రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి అంతాదుల నాగరాజు కళా బృందం వనపర్తి జిల్లాలో భారీ కళా ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో, మండలాలు, మున్సిపాలిటీల్లో నిర్వహించే సాంస్కృతిక కళాయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాం, డిపిఒ సురేష్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, ఏఓ భాను ప్రకాష్, సంస్కృతిక శాఖ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమం గా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న బియ్యం వ్యాపారి అరెస్ట్

**అడవిదేవులపల్లి, నవంబర్ 19,(మనం న్యూస్ ):** గ్రామాలలో అక్రమం గా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆంధ్ర కు తరలిస్తున్న బియ్యం వ్యాపారి ని మంగళవారం నాడు పోలీస్ లు అరెస్ట్ చేసినారు. ప్రభుత్వం పేదలకు అందించే (పీడీఎఫ్) రేషన్ బియ్యాన్ని దాదాపు నాలుగు నెలల క్రితం అక్రమంగా ఓ ఇంటిలో నిల్వ చేయడం తో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 28.07.2024 రోజున అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామములో శిథిలావస్తలో ఉన్న ఇంటిలోఅక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ చేసినట్లు అడవిదేవులపల్లి పోలీసులకు సమాచారం అందినది దీనితో వారు దాడులు చేసి సుమారు (04) క్వింటాల్ల బియ్యం పట్టుబడి చేసినారు.ఇంటి యజమాని రమావత్ ధనమూర్తి తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినారు.ఈ కేసును పోలీసులు విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్టం రెంటాల గ్రామం నకు చెందిన బియ్యం వ్యాపారి తిప్పబత్తుల వెంకటనారాయణ బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ కోటేశ్వర్ రావు , రమావత్ ధనమూర్తి అను ఇద్దరి చేత ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేయబడుతున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని అమయాక ప్రజలను మోసం చేస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ న్నారు.ఆంధ్ర కే చెందిన అంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావు అను ఇద్దరు చేత ఆంధ్రకు అక్రమంగా తరలిస్తున్నట్లుగా తెలిపారు . ఈ కేసులో పరారిలో ఉన్న బియ్యం వ్యాపారి నారాయణను మంగళవారం నాడు పట్టుబడి చేసి రిమాండ్ కు తరలించినమని అడవిదేవులపల్లి మండల ఎస్. ఐ శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్. ఐ శేఖర్ మాట్లాడు తూ పిడిఎఫ్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాకు ఎవరైనా పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. తెలిపిన వారి వివరాలు గొప్యముగా ఉంచుతామని అన్నారు.

# తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**.వనపర్తి ప్రతినిధి, నవంబర్ 19 (మనం న్యూస్):**



జిల్లాలో తాగు నీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి తాగు నీరు, పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మరుగుదొడ్లు లేని ఇల్లు ఉండకుండా చూడాలని, పేదలకు స్వచ్ఛ భారత్ కింద ఉచిత మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు లేని ఇళ్ళు జిల్లాలో 365 గుర్తించడం జరిగిందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా గుర్తించిన వాటికి వెంటనే మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన కట్టించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలోని పాఠశాలలు, హెల్త్ సెంటర్ లు, అంగన్వాడి కేంద్రాల్లో, పంచాయతీ భవనాల్లో, గ్రామ మురుగు నీరు కాలువ చివరలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు చేయించాలని, తద్వారా నీరు భూమిలో చేరి భూగర్భజలాలు పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, 50 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ అమ్మిన వారిపై జరిమాన విధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటి కప్పుడు నీటి పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు కలుషితం లేని స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారిని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, పిడి. డిఆర్డిఏ ఉమాదేవి, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీరు మేఘా రెడ్డి, డిపిఓ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, డిపిఆర్ఓ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# త్రిపురారం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ



**త్రిపురారం, నవంబర్ 19(మనం న్యూస్):** త్రిపురారం మండలం కేంద్రంలో ప్రజలకు అందుబాటులోకి ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందించాలి మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలోని త్రిపురారం పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు,స్థితిగతులు గురించి యస్.ఐలను అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్,డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.దొంగతనాలు జరగకుండా పగలు,రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ లు చేస్తూ ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి,జూదం,అక్రమ ఇసుక,పి.డి.యస్ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోని నియంత్రించాలని అన్నారు.ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పి గారి వెంట మిర్యాలగూడ డి.యస్.పి రాజశేఖర రాజు,హాలియ సి.ఐ జనార్ధన్, త్రిపురారం యస్.ఐ ప్రసాద్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# మన మరుగుదొడ్డి - మన ఆత్మగౌరవం

పెన్ పహాడ్, నవంబర్ 19 (మనం న్యూస్):మన మరుగుదొడ్డి మన ఆత్మగౌరమని, బహిరంగ మలవిసర్జన చేయరాదని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనంతారం,నాగులపహాడ్.గ్రామపంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన నాగుల పహాడ్ గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద నిర్మాణం చేసిన నూతన అంగన్వాడి భవనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా అనంతారం గ్రామంలో



చేపట్టిన ప్రజలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన చేయరాదని, మరుగుదొడ్డిని ఉపయోగించి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓసంజీవయ్య ,గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రాజు, పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి, క్షేత్ర సహాయకులు బేగం, ఆశ కార్యకర్తలు సబిత , జహంగీర్ బేగం, గ్రామపంచాయతీ సిబ్బంది వెంకన్న తదితరులు పాల్గొన్నారు...

# ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి

నల్లగొండ, నవంబర్ 19 (మనం ప్రతినిధి)



ప్రోహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం ర్యాగింగ్ కి పాల్పడితే చర్యలు తప్పవని నల్లగొండ డీఎస్పీ గారు అన్నారు. తేదీ 11.11.2024 రోజు సాయంత్రం ఏడు గంటల సమయంలో నల్గొండ మెడికల్ కాలేజ్ హాస్టల్ లో సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తూ, భౌతిక దాడికి పాల్పడినారని మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రు ఫిర్యాదు మేరకు నలగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో బిఎన్ఎస్ సెక్షన్స్ తో పాటు ర్యాగింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది. ఇట్టి దాడి కి పాల్పడిన వారిని విచారించి వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయి అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం, మెడికల్ కాలేజీలో యాంటీ రాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుంది. మీరు చదువుకునే కాలేజీలలో హాస్టల్లో ఇలాంటి సంఘటనలు జరిగితే వెంటనే పోలీసువారికి గాని, డయల్ 100 కి గాని తెలియజేయాలని సూచించారు.ఎవరైనా ర్యాగింగ్ కి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడతాయని, జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది.ర్యాగింగ్ భూతాన్ని సమిష్టిగా ప్రతి ఒక్కరు విద్యార్థిని విద్యార్థులు, లెక్చరర్స్ మరియు పోలీసులతో కలిసి పారదోలాలని ఆకాంక్షించారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

## పత్తి జిన్నింగ్ మిల్లులపై అధికారుల దాడులు



గద్వాల ప్రతినిధి, నవంబర్ 19 (మనం న్యూస్): గద్వాల టౌన్: జిల్లాను బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మంగళవారం పాన్ ఇండియా బాలకార్మిక రెస్క్యూ లో భాగంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంటా కవిత, బాల రక్ష భవన్ సిబ్బంది మరియు కార్మిక శాఖ అధికారులు కలిసి గద్వాల పట్టణ శివారులో గల పత్తి జిన్నింగ్ మిల్లులో అకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా 7 మంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. వారిని బాలల సంక్షేమ కమిటీకి అప్పగించారు. ఈ సందర్భంగా జడ్జి గంట కవితాదేవి మాట్లాడుతూ... బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 14 సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయస్సు పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ. 50 వేల జరిమానా లేదా జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అనంతరం బాల కార్మిక నియంత్రణ చట్టం పై వారికి అవగాహన కల్పించి వారిని బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరు పరిచారు. బాలల సంక్షేమ కమిటీ వారు పిల్లలకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ఇచ్చి సఖి కేంద్రానికి తరలించారు. సదరు యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవిత, బాల రక్ష భవన్ సిబ్బంది పద్మ, లక్ష్మీ, అసిస్టెంట్ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ లక్ష్మణ స్వామి, డిప్యూటీ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ శ్రీనివాసులు, చీఫ్ డిప్యూటీ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్కూటీలో ప్రత్యక్షమైన కట్ల పాము



గద్వాల ప్రతినిధి, నవంబర్ 19 (మనం న్యూస్): గద్వాల టౌన్: పార్కు చేసిన ఓ స్కూటీలో ఓ పాము దూరింది. బండి తీయడానికి వెళ్లిన వాహనదారుడు సీటు కింద నుంచి కట్ల పాము బయటకు రావడంతో భయంతో వదిలేసి దూరంగా వెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే... గద్వాల పట్టణానికి చెందిన రషీద్ మంగళవారం తన స్కూటీ వాహనాన్ని బీరొల్లు చౌరస్తాలో పార్క్ చేశాడు. కొద్ది సేపటి తర్వాత స్కూటీని తీసి స్టార్ట్ చేయగా అందులో పాము ఉండటం గమనించాడు. దీంతో పామును బయటికు తీసి, పామును చంపడం జరిగింది.

# దళితుల అభివృద్ధికి ఇందిరమ్మ ఎంతో కృషి ఎమ్మెల్యే




**తిరుమలగిరి,నవంబర్ 19( మనం న్యూస్):** ఇందిరమ్మ పాలనలో దళితులకు సేవలందించిన గొప్ప నాయకురాలని తుంగతుర్తి ఎం.ఎల్. ఏ మందులు సామేలు అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఇందిరమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలామాలలు వేసి నీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బల హీన వర్గాలకు ఇందిరమ్మ ఇౌడ్లు, భూ పంపిని, బ్యాంకుల జాతీయకరణ వొటి అనేక కార్యక్రమాలు చేసి పేద ప్రజలకు అండగనిలిచిందని చెప్పారు. అనంతరా హనుమకొండలో జరిగే ప్రజా పాలన విజయోత్సవం, మహిళా శక్తి విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి పాల్గొనే సభకు 5బస్సు లల్లో తరలి వెళ్లే మహిళా సంఘాల మహిళ బస్సులకు పచ్చజెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వై. నరేష్, పట్టణ శాఖ అధ్యక్షులు పేరాల వీరేష్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ సాగంటి అనసూయ రాములు, జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, ప్రియలత రాము గౌడ్, శ్రీలత, తహసిల్దార్ హరి ప్రసాద్, డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపి ఎం మధుసూదన్, జుమ్మిలాల్, కందుకూరై లక్ష్మయ్య, కందుకూరు అంబేద్కర్, సుధాకర్, నాయన కృష్ణ,వంశీ, అబ్బాస్, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

**అనంతగిరి, నవంబర్ 18 (మనం న్యూస్):** ప్రజాస్వామ్య విలువలను మీడియా వ్యవస్థ సంరక్షిస్తూటుందని ఎస్త్రు నవీన్ కుమార్ అన్నారు . అనంతగిరి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయిలో సమాజంలో పాత్రికేయుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను మండల విద్యా వనరుల కార్యాలయం నందు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్త్రు నవీన్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు 1966లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఏర్పడిందని దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకుంటారని సమాజ నిర్మాణంలో నేటి విద్యార్థులె రేపటి భవిష్యత్తుకు పునాదులని అన్నారు విద్యార్థులు విద్యలో ముందుండాలని తెలిపారు విద్యార్థులు చెడు అలవాటులకు బానిస కాకుండా ఉపాధ్యాయులు చెప్పిన బోధనలను అర్థం చేసుకొని మేధాశక్తిని పెంపొందించుకోవాలని తెలియజేశారు రానున్న పదవ తరగతి బోర్డు ఎగ్జామ్స్ లో మండలంలో అత్యధిక ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులు తల్లిదండ్రులకు చదువుతున్న పాఠశాలలకు మంచి ఖ్యాతి తేవాలని అన్నారు విద్యార్థి దశనుండే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని పేర్కొన్నారు అదేవిధంగా విద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని



అన్నారు వ్యాసరచన పోటీలో విజేతలుగా ప్రథమ బహుమతి గురుమూర్తి పాలవరం పాఠశాల ద్వితీయ బహుమతి స్పందన వాయిల సింగవరం పాఠశాల తృతీయ బహుమతి షేక్ ఖాజాబీ అనంతగిరి పాఠశాల నాల్గవ బహుమతి శ్రీరామ్ అమీనాబాద్ పాఠశాల ఐదవ బహుమతి ఉమాదేవి గొండ్రియాల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు అనంతరం వారికి నగదు తో పాటు మెడల్ సీలడ్స్ ప్రశంసా పత్రాలను లను ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుష్మ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గరిడేపల్లి మురళి బానోత్ సతీష్ నూకపంగు ఈదయ్యా నకిరేకంటి కరుణాకర్ రాము ఉపేందర్ మణికంఠ వినయ్ బొడ్డు హుస్సేన్ కోటయ్యా గురుస్వామి ఆయా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్లో అంధుల టీ20 ప్రపంచ కప్.. భారత్ దూరం!

నవంబర్ 23 నుంచి డిసెంబరు 3 వరకు పాకిస్థాన్ వేదికగా అంధుల టీ20 ప్రపంచ కప్ జరగనుంది. ఈ టోర్నీ నుంచి డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ వైదొలిగింది. భారత క్రికెట్ జట్టు పాక్లో పర్యటించడానికి భారత విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించింది. పాకిస్థాన్ వెళ్లడానికి అంధుల క్రికెట్ జట్టుకు క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం లభించింది. కానీ, భారత జట్టును అక్కడికి పంపడానికి విదేశాంగ శాఖ ఆమోదం తెలపలేదు. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టు పాక్లో పర్యటించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిందని భారత అంధుల క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి శైలేంద్ర యాదవ్ తెలిపారు. దీంతో భారత జట్టు లేకుండా టోర్నీ జరగనుంది. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, తమ జట్టు పాకిస్థాన్లో పర్యటించబోదని ఐసీసీకి బీసీసీఐ తేల్చిచెప్పింది. టోర్నీని హైబ్రిడ్ మోడల్లో నిర్వహించి భారత్ మ్యాచ్లను యూఏఈలో నిర్వహించాలని కోరింది. దీనికి పాక్ అంగీకరించడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో అంధుల ప్రపంచకప్ నుంచి భారత్ వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.




## ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్.. భారత జట్టుతో కలిసిన యువ పేసర్



ఉత్తర్ ప్రదేశ్ యువ ఫాస్ట్బౌలర్ యశ్ దయాళ్ బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ కోసం భారత జట్టులో బ్యాకప్ ప్లేయర్గా చేరాడు. ఈ విషయాన్ని యశ్ తండ్రి చందర్పాల్ మంగళవారం జాతీయ మీడియాతో పంచుకున్నారు. అయితే, దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన నాలుగు టీ20ల సిరీస్కు యశ్ దయాళ్ ఎంపికయ్యాడు. కానీ, అరంగేట్రం చేసే అవకాశం దక్కలేదు. ఈ సిరీస్ జరుగుతుండగా ఆస్ట్రేలియాలో టెస్టు జట్టుతో కలవాలని పిలుపొచ్చిందని యశ్ తండ్రి పేర్కొన్నారు. ''యశ్ దయాళ్ దక్షిణాఫ్రికాలో టీ20 జట్టుతో ఉన్నప్పుడు అతను ఆస్ట్రేలియాలో టెస్టు జట్టులో చేరవలసి ఉంటుందని ఒక కాల్ వచ్చింది. అందుకే యశ్ నవంబర్ 17న అక్కడికి వెళ్లాడు. అతను బ్యాకప్ ప్లేయర్గా జట్టులో చేరాడు.ఈ రోజు అతని మొదటి ప్రాక్టీస్ సెషన్. అతను త్వరగా అరంగేట్రం చేసి మంచి ప్రదర్శనలు ఇచ్చి జట్టు విజయాల్లో భాగం కావాలని మేము కోరుకుంటున్నాం'' అని చందర్పాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 26 ఏళ్ల యశ్ దయాళ్ ఇటీవల బంగ్లాదేశ్తో జరిగిన టెస్టు సిరీస్ జట్టులోనూ చోటు దక్కించుకోగా.. అరంగేట్రం చేసే ఛాన్స్ రాలేదు. జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా వంటి పేసర్లు జట్టులో ఉన్నా ఐదు టెస్టుల సిరీస్ కావడంతో ముందు జాగ్రత్త చర్యగా యశ్ దయాళ్ను బ్యాకప్ ప్లేయర్గా తీసుకున్నారు. యశ్ ఇప్పటివరకు 24 ఫస్ట్ క్లాస్ మ్యాచ్లు ఆడి 28.89 యావరేజ్తో 76 వికెట్లు పడగొట్టాడు. నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ ప్రారంభంకానుండగా.. తొలి టెస్టు పెర్త్లో జరగనుంది.

## ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్.. టీమిండియాకు మాజీ కోచ్ సూచనలు..






స్వదేశంలో న్యూజిలాండ్తో జరిగిన టెస్ట్ సిరీస్లో ఘోర పరాభవం నుంచి బయటపడేందుకు టీమిండియా ఆస్ట్రేలియాతో జరిగే తొలి రెండు టెస్టుల్లో రాణించాల్సిన అవసరం ఉందని మాజీ కోచ్ రవిశాస్త్రి పేర్కొన్నారు. న్యూజిలాండ్తో సిరీస్లో భారత జట్టు మూల్యం చెల్లించిందన్నారు. న్యూజిలాండ్తో జరిగిన సిరీస్లో ఆ ఓటమి నుంచి భారత్ తప్పక కోలుకుంటోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ గర్వించే ఇది జట్టు అన్నారు. జట్టు నిరాశకు గురవుతున్నదని.. త్వరలోనే దాన్ని నుంచి బయటపడుతుందన్నారు. ఆ సిరీస్ నుంచి తిరిగి బయటపడేందుకు ప్రారంభ మ్యాచ్లలో మెరుగ్గా ఆడటమేనన్నారు.

ఈ పరిస్థితిలో మొదటి రెండు టెస్ట్ మ్యాచ్లు చాలా కీలకమవుతాయన్నారు. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్లో భాగంగా ఈ నెల 22 నుంచి మొదలవనుండగా.. పెర్త్ స్టేడియంలో మొదలయ్యే ఐదు మ్యాచ్ల సిరీస్కు ఆటగాళ్ల మనస్తత్వం బాగుండేలా చూడాలని రవిశాస్త్రి పేర్కొన్నారు. ప్రారంభం ఘనంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆటగాళ్లను మానసిక స్థితి బాగుండాలని.. ఇది కోచ్కు కీలకమవుతుందన్నారు. 2018-19, 2020-21 సిరీస్ విజయాల సమయంలో శాస్త్రి భారత హెడ్కోచ్గా కొనసాగారు. గత విజయాలను భారత ఆటగాళ్లు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతో ఉంటూ.. సానుకూల అంశాలపై ఆలోచించాలని టీమిండియాకు సూచించారు. ఇటీవల ఫలితాలను పక్కనపెట్టి.. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో సాధించిన విజయాలపై దృష్టి పెట్టాలన్నారు.

## ఆస్ట్రేలియాకు ఛాన్స్ ఇవ్వొద్దు: మాజీ కోచ్ రవిశాస్త్రి




బోర్డర్-గావస్కర్ ట్రోఫీ లో ఆస్ట్రేలియాను మట్టికరిపించాలంటే టీమ్ ఇండియా అత్యున్నత స్థాయి ఆటతీరును ప్రదర్శించాల్సిందే అని మాజీ కోచ్ రవిశాస్త్రి తేల్చి చెప్పాడు. ఓ ఆంగ్ల క్రీడా ఛానెల్తో ఆయన మాట్లాడుతూ భారత్ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించాడు. ''కొన్ని కఠినమైన విషయాలు చెబుతా. ఇక్కడ కోచ్గా మూడు పర్యటనలకు వచ్చిన అనుభవంతో చెబుతున్నాను.. ప్రతి ఆటగాడు అత్యున్నత స్థాయిలో ఆడాల్సిందే. ఆసీస్ చేసే తప్పిదాలను ఒడిసి పట్టుకోవడానికి మీరు పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలి. ప్రత్యర్థికి ఏ మాత్రం ఛాన్స్ ఇవ్వకుండా ఉండటమే ఏకైక మార్గం. అంతకు మించి మరో దారేలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియా మీడియా నుంచి ఎలాంటి స్పందన వస్తుందో ముందే అంచనాకు రండి. అది పూర్తిగా ఆసీస్కు పక్షానే ఉంటుంది. కానీ, మీ కుర్రాళ్లతో కలిసి కఠిన సవాళ్లను విసిరి.. అద్భుతంగా ఆడితే.. మీడియా మిమ్మల్ని గౌరవిస్తుంది'' అని రవిశాస్త్రి వెల్లడించాడు. యశస్వి జైస్వాల్ ఈ పర్యటన ముగిసేనాటికి మరింత మెరుగైన బ్యాటర్గా అవతరిస్తాడని రవిశాస్త్రి అంచనావేశాడు. ''అతడు ప్రపంచ శ్రేణి ఆటగాడు. ఇంగ్లాండ్పై స్వేచ్ఛగా ఆడటం మీరు చూశారు. చాలా శ్రమించి ఆ స్థాయికి వచ్చాడు. పరుగుల దాహం.. ఆడాలన్న కసి అతడి కళ్లలో కనిపిస్తాయి. ఆటలో మమేకమైపోవాలనుకుంటాడు. పెర్త్ వంటి పిచ్లకు అలవాటు పడటం అంత తేలిక కాదు ఏ ఆటగాడికైనా సవాళ్లు విసురుతాయి. కానీ, ఒక్కసారి ఆకళింపు చేసుకొంటే.. తన ఆటతో యశస్వి రంజింప చేస్తాడు. అతడు ఇలాంటి పిచ్లను ఇష్టపడతాడు. ఈ తరహా వికెట్లపై మంచి స్కోర్లు సాధించగల సత్తా ఉన్న వారిలో అతడు కూడా ఒకడు'' అని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాలో 2018, 2021లో టీమ్ ఇండియా విజయాలు సాధించిన సమయంలో రవిశాస్త్రి జట్టుకు కోచ్గా వ్యవహరించాడు. తాజాగా భారత్ ఆసీస్ టూర్లో మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. వీటిల్లో నాలుగు విజయాలు సాధిస్తే కానీ.. సజావుగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్కు చేరగలదు.

## అవార్డుల ఫంక్షన్లో పంచ్లు.. అవన్నీ ముందుగా రాసుకున్నవే: రానా

ఇటీవల జరిగిన అవార్డుల వేడుకలో ఇండస్ట్రీలోని పలువురు నటీనటులపై వ్యాఖ్యతలు రానా, తేజ సజ్జ పేల్చిన జోక్లు అన్నీ ముందుగా అనుకున్నవేనని సినీ నటుడు రానా తెలిపారు. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'ది రానా దగ్గుబాటి షో'. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా నవంబరు 23 తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ షోతో పాటు, వివిధ అంశాల గురించి రానా పలు విషయాలను పంచుకున్నారు.

**క్లైమాక్స్లో ఇంగ్లీష్ పాట వద్దే వద్దు.. ఉండాల్సిందేనన్న పవన్కల్యాణ్**

- ''ప్రస్తుతం టాక్ షోలు బాగా పాపులర్ అయ్యాయి. ముఖ్యంగా ఇద్దరు వ్యక్తులు కూర్చొని మాట్లాడుకునే పాడ్కాస్ట్లకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో టాక్ షోలకు మంచి స్పందన ఉంటుందని భావించాం. ఎప్పటి నుంచో అమెజాన్ ప్రైమ్ వాళ్లతో కలిసి పనిచేయాలని అనుకున్నా. చాలా ఆలోచనల తర్వాత 'టాక్ షో' చేద్దామని నిర్ణయం తీసుకున్నాం''
- ''సీజన్-1లో మొత్తం 8 ఎపిసోడ్స్ ఉంటాయి. ఒక్కో ఎపిసోడ్ 40 నిమిషాలపైనే ఉంటుంది. కొన్ని ఇంకా ఎక్కువ సమయం కూడా ఉంటాయి. షూటింగ్ దగ్గరి నుంచి ఎడిటింగ్ వరకూ చాలా విషయాలను దగ్గరుండి చూసుకున్నా. ప్రభాస్, బాలకృష్ణలను ఈ టాక్ షోకు ఆహ్వానించాలని ఉంది. దీనిపై వారితో మాట్లాడి త్వరలోనే నిర్ణయం తీసుకుంటా''
- ''సగటు ప్రేక్షకుడి వినోద మాధ్యమం మారిపోతూ వస్తోంది. మా తాతగారి కాలంలో థియేటర్లు, సినిమాలే అతి పెద్ద ఎంటర్టైన్మెంట్. మా నాన్నగారి హయాంలో టెలివిజన్, మ్యూజిక్ వచ్చి చేరాయి. మేము కూడా కేవలం సినిమాకు పరిమితం కాకుండా అటువైపు అడుగులు వేశాం. ఇప్పుడు నేను సోషల్మీడియా కాలంలో ఉన్నాను''
- ''తాతయ్య కాలంలో కొంతమంది మాత్రమే సినిమాలు తీశారు. ఇప్పుడు కొత్త వాళ్లు వస్తున్నారు. కంటెంట్ మారిపోతోంది. అందుకు అనుగుణంగా మేమూ మారాలి కదా! మా కంపెనీ పెట్టి 60ఏళ్లు. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా టాక్ షోలు, ఫిక్షన్స్ స్టోరీలు, ఫీచర్ ఫిల్మ్స్, కామిక్ బుక్స్, కథలు కొనసాగుతున్నాయి. ఇప్పటికి చేసినవి కాకుండా కొత్తవి చేస్తూ వెళ్తున్నాం''
- ''సినిమాలంటే నాకు బాగా ఇష్టం. ఒక మూవీ చూసినప్పుడు ఇతర ప్రేక్షకుల్లాగానే నేనూ బాగా ఆస్వాదిస్తా. నాతో పాటు కూర్చొన్న వారు ఎలా స్పందిస్తున్నారో కూడా చూస్తా. మంచి సినిమాలను ప్రేక్షకులకు వద్దకు తీసుకెళ్లాలన్నది నా అభిమతం. ప్రస్తుతం ఇండస్ట్రీలో నడుస్తున్న కమర్షియల్ రేసును ఎవరో ఒకరు బ్రేక్ చేయాలి. అది నేనే. అందుకే '35: ఓ చిన్న కథ'లాంటి మూవీలను ప్రోత్సహిస్తున్నాం. మీ కథ ప్రత్యేకంగా ఉంటే ఎవరూ ఆపలేరు. ఎలా బిజినెస్ చేయాలో మేము చెబుతామంతే''
- ''ఎంచుకున్న పాత్రలకు అనుగుణంగా శారీరకంగా చాలా రకాలుగా మారాను. దాని వల్ల ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయి.



## జపాన్లో చిరంజీవి విశ్వంభర టీం..




టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి ప్రస్తుతం విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్టుకు బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్లో నటిస్తోంది. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆష్రిత వేముగంటి నందూరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తాజాగా విశ్వంభర షూటింగ్ అప్డేట్ ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం చిరంజీవి టీం జపాన్లో ఉంది. తాజా టాక్ ప్రకారం చిరంజీవి, త్రిషపై వచ్చే సాంగ్ చిత్రీకరిస్తుండగా.. నవంబర్ 21న చిరంజీవి టీం హైదరాబాద్కు తిరిగి రానుందట. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ అభిమానులను నిరాశపర్చగా.. ప్రేక్షకుల అంచనాలు అందుకునేలా వీఎఫ్ఎక్స్ క్వాలిటీని పెంచే పనిలో ఉందని ఇన్సైడ్ టాక్.

ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న గ్రాండ్గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. యూవీ క్రియేషన్స్ బ్యానర్పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. సినిమాపై క్యూరియాసిటీతోపాటు సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.

## సైకిల్ తోసుకుంటూ వెళ్తున్న రామ్ పోతినేని..



ఈ ఏడాది టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన డబుల్ఇస్మార్ట్ భారీ అంచనాల మధ్య విడుదలై డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. దీంతో ఈ సారి రూటు మార్చి సరికొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్షన్లో సినిమా చేస్తున్నాడని తెలిసిందే.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమాన్ని నవంబర్ 21న నిర్వహిస్తున్నట్టు తెలియజేస్తూ.. మూవీ లవర్స్ కోసం ప్రీ లుక్ విడుదల చేశారు మేకర్స్. తాజా..కొత్త.. ఇదివరకెన్నడూ చెప్పనిది.. అంటూ సైకిల్ను తోసుకుంటూ వెళ్తున్న స్టిల్ షేర్ చేశారు మేకర్స్. సూపర్ టాలెంటెడ్ మహేశ్ బాబుతో పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ ట్వీట్ చేశాడు రామ్. కొంతకాలంగా యాక్షన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన రామ్ ఈ సారి మాత్రం ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే కథతో రాబోతున్నాడని అర్థమవుతోంది. ఇంతకీ రామ్ కోసం మహేశ్ బాబు ఎలాంటి కథ రెడీ చేశాడనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని తెలుస్తోంది. ఇంతకీ ఇందులో రామ్కు జోడీగా ఎవరు కనిపించబోతున్నారన్నది తెలియాల్సి ఉంది.

## సంక్రాంతికి వస్తున్నాం.. థియేటర్లలోకి వచ్చే టైం చెప్తామంటున్న వెంకటేశ్ టీం



**ఫస్ట్ లుక్ పోస్టర్లో వెంకటేశ్ లుంగీ ధరించి సీరియస్గా తుపాకీ పట్టుకుని ఉండగా.. ఓ వైపు ఐశ్వర్య రాజేశ్ చీరలో.. మరోవైపు మీనాక్షి చౌదరి మోడ్రన్ అవతార్లో కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుండగా.. రేపు ప్రెస్మీట్లో విడుదల తేదీని ప్రకటిస్తామని తెలియజేశారు మేకర్స్.భారీ బడ్జెట్తో కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్గా వస్తోన్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే , ప్రముఖ తమిళ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.**

WANTED

రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్న 'మనం' తెలుగు దినపత్రికకు ఈ క్రింది జిల్లా కేంద్రాల్లో పనిచేసేందుకు బ్యూరో, జిల్లా ఇంఛార్జీలు కావలెను. వెంటనే సంప్రదించగలరు.

జగిత్యాల + పెద్దపల్లి + వరంగల్ + కొమురంభీం ఆసిఫాబాద్
హన్మకొండ + నిజామాబాద్ + ములుగు + నిర్మల్
కామారెడ్డి + మేడ్చల్ మల్కాజ్‌గిరి + యాదాద్రి భువనగిరి

సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్
9391285007

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.